

గణేశ్ మృతదేహం వద్ద విలపిస్తున్న అతడి భార్య అనూష



పోలీసులు అదుపులోకి తీసుకున్న స్మగ్లర్లు



కారులో ఉన్న ఎర్రచందనం దుంగలు

చెలరేగిపోయిన స్మగ్లర్లు

- కేవీపల్లె మండలంలో దారుణం
- కారుతో ఢీకొట్టి పోలీసు కానిస్టేబుల్ హత్య
- మృతుడిది శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం
- గణేశ్ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా : ఎస్పీ
- పీలేరు ప్రాంతంలో ఇదే మొదటిది
- నివ్వెరపోయిన పోలీసు, ఫారెస్టు సిబ్బంది, ప్రజలు



స్మగ్లర్ల చేతిలో హతమైన కానిస్టేబుల్ గణేశ్

సంఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ కృష్ణారావు, ఇతర పోలీసు అధికారులు

పీలేరు, ఫిబ్రవరి 6: ఇంతకాలం దొంగ దారుల్లో స్మగ్లింగ్ చేస్తూ వచ్చిన ఎర్రచందనం స్మగ్లర్లు మంగళవారం ఉదయం చెలరేగిపోయారు. పోలీసుల కన్నుగప్పి ఎర్రచందనం అక్రమ రవాణాను సాగిస్తున్న వారు ఆ పోలీసుల ప్రాణాలే లక్ష్యంగా తెగబడ్డారు. తమ అక్రమ రవాణాను అడ్డుకోబోయిన ఓ పోలీసు కానిస్టేబుల్‌ను దారుణంగా, విచక్షణా రహితంగా కారుతో గుద్ది హత్య చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఈ సంఘటన మంగళవారం తెల్లవారుజామున కేవీపల్లె మండలం ఎంవీపల్లె పంచాయతీ చెరువుముందర గుండ్రేవారిపల్లె గ్రామ సమీపంలోని గొల్లపల్లె చెరువు వద్ద జరిగింది. పోలీసుల కథనం మేరకు... సుండుపల్లె, సానిపాయ అటవీ ప్రాంతాల్లో సమృద్ధిగా ఉన్న ఎర్రచందనం వృక్షాలపై చాలాకాలంగా తమిళనాడుకు చెందిన స్మగ్లర్ల కన్నుపడింది. సానిపాయ అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం వృక్షాలను నరికి దుంగలుగా మలచి సుండుపల్లె, పీలేరు మీదుగా తమిళనాడు రాష్ట్రం చెన్నైకు తరలిస్తున్నారు స్మగ్లర్లు. విలువైన సంపదను కాపాడాలన్న లక్ష్యంతో ఇటీవలి కాలంలో పోలీసులు, ఫారెస్టు సిబ్బంది స్మగ్లర్ల కదలికలపై నిఘా పెంచారు. ఎక్కడికక్కడ స్మగ్లింగ్‌ను అడ్డుకుంటూ అక్రమ రవాణాకు చెక్ పెడుతున్నారు. ఈ నేపథ్యంలో సానిపాయ అటవీ ప్రాంతం నుంచి ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారం రావడంతో ఆర్‌ఎస్‌ఐ విశ్వనాథ్ నేతృత్వంలోని ఏడుగురు కానిస్టేబుళ్లతో కూడిన టాస్క్‌ఫోర్స్ బృందం సోమవారం రాత్రి కేవీపల్లె-సుండుపల్లె మండలాల సరిహద్దు ప్రాంతమైన ఎంవీపల్లె పంచాయతీ చెరువుముందర గుండ్రేవారిపల్లె గ్రామ సమీపంలోని గొల్లపల్లె చెరువు వద్ద వాహనాల తనిఖీ చేపట్టింది.

మంగళవారం తెల్లవారుజామున 2.30 గంటల ప్రాంతంలో గంటల ప్రాంతంలో సుండుపల్లె వైపు నుంచి వేగంగా వస్తున్న కేఏ02 ఎంజీ 2842 నెంబరు గల మారుతీ స్విఫ్ట్ కారును టాస్క్‌ఫోర్స్ బృందం ఆపింది. పోలీసులు వాహనాలను ఆపినప్పుడు సహజంగా ఎర్రచందనం స్మగ్లర్లు తమ వాహనాలను ఆపి పారిపోవడమో లేక వేగంగా ముందుకు దూసుకెళ్లిపోవడమో చేస్తుంటారు. వాహనాల తనిఖీలు జరిపే పోలీసులు సైతం ఇదే ఆలోచనతో ఉంటుంటారు. అందుకు అనుగుణంగా అనుమానాస్పద వాహనాలను ఆపినప్పుడు పోలీసులు కూడా బృందాలుగా విడిపోయి ఆయా వాహనాలను చుట్టుముడుతుంటారు. మంగళవారం తెల్లవారుజామున కూడా పోలీసులు ఇదే పంథాను అనుసరించినప్పటికీ స్మగ్లర్లు భిన్నంగా వ్యవహరించారు. వాహనాల తనిఖీలు గమనించిన స్మగ్లర్లు పోలీసులు ఉన్న చోటుకు రాగానే తమ కారును నెమ్మదించారు. కారు నెమ్మదించడంతో టాస్క్‌ఫోర్స్ బృందంలోని గణేశ్ (30) అనే కానిస్టేబుల్ ఎడమ వైపు నుంచి, మరో నలుగురు కుడి వైపు నుంచి అడ్డుకోవడానికి ప్రయత్నించారు. ఇంతలో స్మగ్లర్లు గణేశ్ ఉన్న వైపుకు తిప్పి వేగంగా ముందుకు పోనివ్వడంతో అతను కారుకు ఎదురుగా వచ్చేశాడు. అయినప్పటికీ భయపడకుండా కారును ఆపేందుకు ప్రయత్నించాడు. బరితెగించిన స్మగ్లర్లు గణేశ్‌ను గుద్దుకుంటూ కారును ముందుకు పోనిచ్చారు. కారు గుద్దడంతో గణేశ్ కిందపడిపోగా స్మగ్లర్లు కారును అతడి మీద నుంచి పోనిచ్చారు. దీంతో అతడు తీవ్రంగా గాయపడ్డాడు. ఊహించని ఈ హఠాత్పరిణామంతో మిగిలిన పోలీసులు షాక్‌కు గురయ్యారు. వెంటనే తేరుకుని ఓవైపు గణేశ్‌ను కాపాడే ప్రయత్నం చేస్తూనే మరో వైపు కారును వెంబడించారు. పోలీసుల నుంచి ప్రతిఘటన ఎదురుకావడంతో స్మగ్లర్లు సంఘటనా స్థలం నుంచి కాసింత దూరం వెళ్లి గొల్లపల్లె చెరువు ప్రాంతంలోని పల్లపు ప్రాంతంలో కారును వదిలేసి పారిపోయేందుకు ప్రయత్నించారు. ఆ సమయంలో కారులో ఐదుగురు స్మగ్లర్లు ఉండగా పోలీసులు చాకచాక్యంగా ఇద్దరిని పట్టుకోగలిగారు. వారిని తమిళనాడుకు చెందిన వారిగా గుర్తించారు. మిగిలిన ముగ్గురు పరారయ్యారు. అక్కడి నుంచి సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వెంటనే గణేశ్‌ను చికిత్స కోసం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అతను ప్రాణాలు వదిలాడు. ఆసుపత్రికి తీసుకువచ్చేటప్పటికే అతను మృతి చెందినట్లు పీలేరు వైద్యులు నిర్ధారించారు. గణేశ్‌కు భార్య అనూష, రాజ్‌కిశోర్ (6), వేదాన్ష్ (2) అనే ఇద్దరు కొడుకులు ఉన్నారు. అనంతపురంలోని ఏపీఎస్పీ 14వ బెటాలియన్‌కు చెందిన గణేశ్ గత కొంతకాలంగా తిరుపతిలోని టాస్క్‌ఫోర్స్‌లో పని చేస్తున్నాడు. ఎర్రచందనం స్మగ్లింగ్ జరుగుతుందన్న సమాచారం మేరకు అన్నమయ్య, తిరుపతి, చిత్తూరు జిల్లా పరిధిలో టాస్క్‌ఫోర్స్ సిబ్బంది దాడులు చేస్తుంటారు. ఈ క్రమంలో కేవీపల్లె ప్రాంతంలో స్మగ్లింగ్ జరుగుతోందన్న సమాచారం రావడం, వాహనాల తనిఖీ చేపట్టడం, ఊహించని విధంగా స్మగ్లర్లు చెలరేగడంతో గణేశ్ వీరమరణం పొందాడు.

గణేశ్ మృతి చెందిన విషయం తెలుసుకున్న అతడి భార్యాపిల్లలు, బంధువుల మంగళవారం ఉదయం పీలేరు ఆసుపత్రికి చేరుకున్నారు. 'నాకేమీ కాదు, నేను బాగానే ఉన్నాను, తెల్లారగానే ఇంటికి వచ్చేస్తానని చెబితివి కదా, మేమంతా వచ్చాం, లే గణేశ్' అంటూ అతడి భార్య పెట్టిన ఆర్తనాదాలు అక్కడున్న వారందరి కళ్లల్లో నీళ్లు తెప్పించాయి. జరిగిన అనర్థం అర్థం కాక అతడి పిల్లలు నిస్తేజంగా పడుకుని ఉన్న తండ్రిని, కన్నీరుమున్నీరుగా విలపిస్తున్న తల్లిని అమాయకంగా చూడడం అందరినీ కలిచి వేసింది. ఈ సంఘటన సమాచారం అందుకున్న అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, తిరుపతి ఎర్రచందనం టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులు హుటాహుటిన సంఘటనా స్థలానికి చేరుకుని సంఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. గణేశ్ మృతదేహానికి అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు, అంతేకాకుండా టాస్క్‌ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్న స్మగ్లర్లను విచారించారు.

గణేశ్ కుటుంబానికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా : ఎస్పీ

ఎర్రచందనం స్మగ్లర్ల కారణంగా మృతి చెందిన గణేశ్ కుటుంబానికి ప్రభుత్వం రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియా ప్రకటించిందని ఎస్పీ కృష్ణారావు తెలిపారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రిలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడారు. స్మగ్లింగ్‌ను అరికట్టే క్రమంలో గణేశ్ ప్రాణాలు కోల్పోవడం బాధాకరమని, అతడి కుటుంబానికి తమ శాఖ అండగా ఉంటుందన్నారు. తమ సహచరుడిపై దాడి జరిగినా మిగిలిన సిబ్బంది ప్రాణాలకు తెగించి స్మగ్లర్లను పట్టుకున్నారని, వారి ధైర్యసాహసాలను అభినందిస్తున్నామన్నారు. గణేశ్ మృతికి కారణమైన స్మగ్లర్లను విచారిస్తున్నామని, పారిపోయిన వారి కోసం గాలింపు ముమ్మరం చేశామని, వారి వెనుక ఎంతటి వారున్నా వదిలిపెట్టబోమని ఎస్పీ స్పష్టం చేశారు. ఆయనతోపాటు తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాసులు విలేఖరుల సమావేశంలో పాల్గొన్నారు.

పీలేరు ప్రాంతంలో ఇదే మొదటిది

పీలేరు పరిసర ప్రాంతంలో ఎర్రచందనం స్మగ్లింగ్ కార్యకలాపాలు దశాబ్దాలుగా సాగుతున్నా పోలీసులపై ప్రాణాంతక దాడి జరగడం ఇదే మొదటిసారి. గతంలో పోలీసులు, ఫారెస్టు అధికారులపై అటవీ ప్రాంతాల్లో రాళ్ల దాడులు, కూంబింగ్ పోలీసులపై తిరగబడడం, వాహనాల తనిఖీల సమయంలో తమ వాహనాలు ఆపకుండా వెళ్లిపోవడం వంటి సంఘటనలు పీలేరు ప్రాంత వాసులు చూసి ఉన్నారు. పోలీసులను చూసినా భయపడకుండా వారిపై దాడికి పాల్పడిన సంఘటన మంగళవారం సంచలనం సృష్టించింది. అయితే ఇటీవలి కాలంలో తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు, కూలీలు తమపై దాడులకు తెగబడుతున్నారని మంగళవారం చాలామంది ఫారెస్టు సిబ్బంది తెలిపారు. వాహనాలు ఆపినప్పుడు తమపై భౌతిక దాడులకు పాల్పడడం, వాహనాలను వెంబడించే క్రమంలో వారి వాహనాలతో తమ వాహనాన్ని గుద్దే ప్రయత్నం చేయడం ఎక్కువైపోయాయని, చాలాసార్లు తమకు గాయాలు కూడా అవుతుంటాయని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధిక సందర్భాల్లో తాము కూంబింగ్, వాహనాల తనిఖీలు రాత్రిళ్లు చేస్తూ ఉండడంతో వారి చేతుల్లో ఎటువంటి ఆయుధాలు ఉంటాయో కూడా తెలియదని, 15 రోజుల క్రితం వాహనాన్ని ఆపేందుకు ప్రయత్నించిన తనపై పదునైన ఆయుధంతో దాడి చేయగా తన చేతికి నాలుగు కుట్లు వేయించుకోవాల్సి వచ్చిందని పీలేరు ప్రాంతంలో విధులు నిర్వహించే ఓ ఫారెస్టు అధికారి తెలిపారు.

మరిన్ని జాగ్రత్తలతో స్మగ్లింగ్ నివారణకు కృషి : డీఎఫ్‌వో

జిల్లాలోని సానిపాయ ప్రాంతంలో ఎర్రచందనం ఎక్కువగా ఉండడంతో తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు ఇటువైపు ఎక్కువగా వస్తున్నారని జిల్లా ఫారెస్టు అధికారి వివేక్ తెలిపారు. అటవీ ప్రాంతాల్లో తమిళనాడుకు చెందిన స్మగ్లర్లు ప్రాణాంతక దాడులు చేయగలరని తాము అంచనా వేసుకున్నప్పటికీ మైదాన ప్రాంతాల్లో, అదీ పోలీసులపై ఘాతుకానికి పాల్పడగలరని ఊహించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంతో విలువైన అటవీ సంపదను కాపాడే ప్రయత్నంలో అమరుడైన గణేశ్ కుటుంబానికి తమ శాఖ తరపున సహాయ సహకారాలు అందిస్తామని, భవిష్యత్తులో ఇటువంటి సంఘటనలు జరగకుండా ఏ విధమైన చర్యలు తీసుకోవాలో క్షుణ్ణంగా అధ్యయనం చేస్తామన్నారు. తొమ్మిది నెలల కాలంలో సుమారు 1700 కేసుల్లో వివిధ కోర్టుల్లో చార్జిషీట్లు దాఖలు చేశామని ఆయన వివరించారు.

గణేశ్ మృతదేహానికి ఉన్నతాధికారుల నివాళి

ఎర్రచందనం స్మగ్లర్ల చేతిలో ప్రాణాలు కోల్పోయిన కానిస్టేబుల్ గణేశ్ మృతదేహానికి పోలీసు, ఫారెస్టు ఉన్నతాధికారులు మంగళవారం ఘనంగా నివాళులర్పించారు. ప్రమాదం జరిగిన వెంటనే అతనిని పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించేలోపే అతను ప్రాణాలు కోల్పోవడంతో పోస్టుమార్టం నిమిత్తం అతని మృతదేహాన్ని పీలేరు ఆసుపత్రి మార్చురీ పెట్టారు. అతను మాతృ సంస్థ అయిన అనంతపురం ఏపీఎస్పీ 14వ బెటాలియన్ డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు, అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావు, అన్నమయ్య డీఎఫ్‌వో వివేక్, ఫ్లయింగ్ స్క్వాడ్ డీఎఫ్‌వో జేవీ సుబ్బారెడ్డి, తిరుపతి టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్, రాయచోటి డీఎస్పీ మహబూబ్‌బాషా, మదనపల్లె సబ్ డీఎఫ్‌వో శ్రీనివాసులు, సీఐలు మోహన్‌రెడ్డి, శ్రీనివాసులు, టాస్క్‌ఫోర్స్ సీఐ శ్రీనివాసులు, ఎఫ్ఆర్‌వో రామ్లానాయక్ మార్చురీలోని గణేశ్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ సందర్భంగా డీఐజీ సీహెచ్ వెంకటేశ్వర్లు మాట్లాడుతూ విధి నిర్వహణలో గణేశ్ ఎప్పుడూ చురుగ్గా ఉండేవాడని, అతడి చురుకుదనం గమనించి అతడి విజ్ఞప్తి మేరకు తానే టాస్క్‌ఫోర్స్‌కు సిఫార్సు చేశానని తెలిపారు. అతని వీరమరణం వృథా కాదని, తమ సిబ్బంది మరింత కటువుగా వ్యవహరించి ఎర్రచందనం స్మగ్లింగ్ అరికట్టడానికి కృషి చేస్తారన్నారు.

మత సామరస్యానికి ప్రతీక రాయచోటి

- జామియా మసీదులో కలెక్టర్, జేసీ ప్రత్యేక ప్రార్థనలు



జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6: మత సామరస్యానికి ప్రతీక రాయచోటి అని కలెక్టర్ అభిషిక్త్ కిశోర్ అన్నారు. పట్టణంలోని ఠాణా వద్ద గల జామియా మసీదును మంగళవారం కలెక్టర్, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్‌లు సందర్శించారు. వీరికి మసీదు మత పెద్దలు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం కలెక్టర్, జేసీలను మున్సిపల్ చైర్మన్ షేక్ ఫయాజ్‌బాషా, బేపారి మహమ్మద్‌ఖాన్‌తో పాటు మసీదు మత పెద్దలు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా మత పెద్దలతో కలసి కలెక్టర్, జాయింట్ కలెక్టర్లు జామియా మసీదులో ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. మత పెద్దలు జామియా మసీదు చరిత్రను కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జాతీయ సమైక్య వాదాన్ని పెంపొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కులమతాలకతీతంగా పర్వదినాలను అందరూ కలిసికట్టుగా జరుపుకోవాలని సూచించారు. మసీదు అభివృద్ధికి ప్రభుత్వం తరఫున తోడ్పాటు అందచేస్తామని తెలిపారు. ప్రార్థనల్లో మున్సిపల్ వైస్ చైర్మన్ ఫయాజుర్ రెహమాన్, కౌన్సిలర్లు తదితర ముస్లిం మైనార్టీ నేతలు పాల్గొన్నారు.

రైళ్ల కోసం ప్రయాణికుల పడిగాపులు

- మూడు గంటలు ఆలస్యంగా నడిచిన గుంతకల్లు-తిరుపతి రైలు
- తిరుపతి-గుంతకల్లు రైలు కూడా రెండు గంటలు ఆలస్యం



రైలు కోసం వేచి ఉన్న ప్రయాణికులు

ములకలచెరువు, ఫిబ్రవరి 6: ములకలచెరువు రైల్వేస్టేషన్‌లో ప్రయాణికులు పడిగాపులు కాశారు. గుంతకల్లు నుంచి తిరుపతికి నడిచే ప్యాసింజర్ రైలు సాంకేతిక కారణాలతో మూడు గంటలు ఆలస్యంగా నడిచింది. ఈ రైలు ములకలచెరువు రైల్వేస్టేషన్‌కు ఉదయం 10.34 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 1.34 గంటలకు వచ్చింది. అలాగే తిరుపతి నుంచి గుంతకల్లుకు నడిచే ప్యాసింజర్ రైలు ములకలచెరువుకు ఉదయం 10.39 గంటలకు రావాల్సి ఉండగా మధ్యాహ్నం 12.30 గంటలకు వచ్చింది. ఈ రైలు కూడా సుమారు రెండు గంటల పాటు ఆలస్యంగా నడిచింది. రెండు రైళ్లు ఆలస్యంగా నడవడంతో ప్రయాణికులు గంటల తరబడిగా వేచి చూడాల్సిన పరిస్థితి నెలకొంది.

ఇసుక అక్రమ రవాణాపై ఎస్ఈబీ దాడులు

- ఇసుక ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా
- ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 6: పీటీఎం మండలం బూర్లపల్లె సమీపంలోని మల్లెల ఏటిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తుండగా పట్టుకుని ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ములకలచెరువు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ జి.రామ్మోహన్ తెలిపారు. మల్లెల ఏటిలో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారని మంగళవారం ఆంధ్రజ్యోతిలో 'తోలుకున్నోళ్లకు తోలుకున్నంత' శీర్షికన కథనం ప్రచురితమైంది. ఈ వార్తపై స్పందించిన ఎస్ఈబీ అధికారులు మంగళవారం పీటీఎం మండలానికి చేరుకుని దాడులు చేశారు. ఉదయం మల్లెల ఏటిలో నుంచి బూర్లపల్లెకు చెందిన సుబ్బిరెడ్డి అనే వ్యక్తి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ పట్టుకుని రికార్డులు పరిశీలించారు. ఎటువంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్నారని తెలుసుకుని మొదటివిడగా పట్టుబడిన ట్రాక్టర్‌కు రూ.10 వేలు జరిమానా విధించినట్లు ఆయన తెలిపారు. ఎవరైనా అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

యువతను చైతన్యపరచాలి

రాజకీయ పార్టీల నాయకుల సమావేశంలో ఆర్డీవో

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6: యువత ఓటరుగా నమోదు చేయించడంలో రాజకీయ పార్టీలు యువతను చైతన్య పరచాలని ఆర్డీవో హరిప్రసాద్ తెలిపారు. మంగళవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన రాజకీయ పార్టీ నాయకుల సమావేశంలో ఆర్డీవో మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో ప్రజల భాగస్వామ్యం చాలా ముఖ్యమన్నారు. కొత్త ఓటర్ల నమోదు ప్రకియ నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమయ్యేంత వరకు నిత్యం జరుగుతుందన్నారు. రాజకీయ పార్టీలు వారి బూత్ లెవెల్ ఏజెంట్లను అప్రమత్తం చేయడంతో పాటు 9 పోలింగ్‌స్టేషన్‌లకు ఖాళీగా వున్న బీఎల్‌ఏల జాబితాను వెంటనే ఇవ్వాలన్నారు. అనంతరం మదనపల్లె పట్టణం, మండలంలో పనిచేస్తున్న బూత్‌లెవెల్ అధికారులతో సమీక్షించిన ఆర్డీవో మాట్లాడుతూ ఫారమ్ 6, 7, 8లను తీసుకుని ప్రతి ఇంటికి వెళ్లి క్షేత్రస్థాయిలో పరిశీలించాలన్నారు. ముఖ్యంగా మృతి చెందిన ఓటర్లను, బదిలీపై వెళ్లిన వారివి, వలసలు వెళ్లిన వారివి, డబుల్ ఎంట్రీ ఓటర్లను గుర్తించి, వారి కుటుంబీకులకు నోటీసులు ఇచ్చిన తరువాతనే జాబితా నుంచి తొలగించాలన్నారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, మదనపల్లె తహసీల్దార్ రమాదేవి, రాజకీయ పార్టీ నాయకులు జింకా వెంకటచలపతి, సుధాకర్, భగవాన్, సీపీఎం శ్రీనివాసులు, గొంగడి కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.



రాజకీయ పార్టీల నాయకులకు సూచనలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

నాణ్యమైన విద్యుత్ సేవలు అందించాలి

- విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీ సుబ్బరాజు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6: గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఉన్న విద్యుత్ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందించాలని విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ ఎన్‌వీ సుబ్బరాజు తెలిపారు. మంగళవారం ఆయన రాయచోటి పట్టణంలోని విద్యుత్ శాఖ డివిజనల్ కార్యాలయంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ చంద్రశేఖర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో మాట్లాడుతూ పట్టణ, గ్రామీణ ప్రాంత వినియోగదారులకు విద్యుత్ ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. అలాగే రైతులకు 9 గంటలు నాణ్యమైన విద్యుత్ సరఫరాను అందించాలని తెలిపారు. వినియోగదారుల నుంచి ఫిర్యాదులు వచ్చిన వెంటనే స్పందించి వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. రైతులకు మెరుగైన విద్యుత్ సేవలు అందించడంతో పాటు 11 కేవీ లైన్లు ఓవర్‌లోడ్ లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే 33 కేవీ లైన్లు మెయింటెనెన్స్ చేసుకుంటూ విద్యుత్ సరఫరాలో ఎటువంటి అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు చూసుకోవాలన్నారు. విద్యుత్ బిల్లుల బకాయిలను నిర్లక్ష్యం చేయకుండా వసూలు చేయాలని, రైతులకు సంబంధించిన ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోతే సకాలంలో స్పందించి పునరుద్ధరించాలని ఆయన సూచించారు. అనంతరం రాయచోటి విద్యుత్ సబ్ డివిజన్ పరిధిలోని సంబేపల్లె మండలం దేవపట్ల 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి మండలంలోని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌ను ఇవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు చాంద్‌బాషా, విజయ్‌కుమార్‌రెడ్డి, రామచంద్రారెడ్డి, అకౌంట్ ఆఫీసర్ పాపయ్య, కమర్షియల్ ఏఈ నరేంద్రనాథరెడ్డి, అన్ని మండలాల ఏఈలు, జేఈలు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ శాఖ టెక్నికల్ డైరెక్టర్ సుబ్బరాజు

తప్పులను సరిదిద్దేదెవరు...!

- చనిపోయిన వారికీ ఓటు
- ఒకే పోలింగ్ బూత్‌లో చనిపోయిన 14 మందికి ఓట్లు

ఒంటిమిట్ట, ఫిబ్రవరి 6: ఎన్నికల కమిషన్ ప్రకటించిన తుది ఓటర్ల జాబితాలో అక్రమాలు తవ్వేకొద్దీ బయటపడుతూనే ఉన్నాయి. ముసాయిదా ఓటర్ల జాబితాలోని అక్రమాలపై అనేక ఫిర్యాదులు చేసినా వాటిని తొలగించకుండా తుది ఓటర్ల జాబితా ప్రకటించారు. అందులో చనిపోయిన వారి ఓట్లు కూడా అలాగే ఉన్నాయి. రాజంపేట నియోజకవర్గ ఒంటిమిట్ట పోలింగ్ కేంద్రంలో 45లో మొత్తం ఓటర్లు 891 మంది కాగా అందులో పురుషులు 436, స్త్రీలు 455 ఓటర్ల లిస్టులో ఉండగా వారిలో ఏకంగా 14 మంది చనిపోయిన వారి ఓటర్లు లిస్టులో ఉన్నాయి. సీరియల్ నెంబరు 24 యాడ్ల రామాంజనేయులు ఓటరు కార్డు నెంబరు ఎల్ఎంఎల్2253059, సీరియల్ నెంబరు 22 పాటూరు సుబ్బరామిరెడ్డి జేఓకె0715789, సీరియల్ నెంబరు 382 భీయ్య బ్రహ్మదండు జేవోకె0903287, సీరియల్ నెంబరు 441 వెంకట సుబ్బయ్య జేవోకె104430, సీరియల్ నెంబరు 444 వెంకటసుబ్బయ్య, పెద్దపల్లి జేవోకె0104839, సీరియల్ నెంబరు 562 సాయి ప్రసాద్ ఎల్ఎంఎల్0740456, సీరియల్ నెంబరు 581 మల్లేష్ పెద్దపల్లి జేవోకె1809631, సీరియల్ నెంబరు 598 విజయమ్మ నీలపూజ జేవోకె1809730, సీరియల్ నెంబరు 599 శేషమ్మ సిరారపు జేవోకె1809763, సీరియల్ నెంబరు 606 చిన్న నరసమ్మమల్లెల జేవోకె1809789, సీరియల్ నెంబరు 664 రామయ్య ఆయపాటి ఎల్ఎంఎల్2252609, సీరియల్ నెంబరు 690 వెంకటసుబ్బయ్య బుర్ర ఎల్ఎంఎల్ 2252609, సీరియల్ నెంబరు 705 మోదుగుల శేషమ్మ జేవోకె1810134, సీరియల్ నెంబరు 732 నాగలక్షుమ్మ ఆవుల బాలయ్యగారి జేవోకె1809011 ఇలా 14 మంది ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో చనిపోయిన వారు ఉన్నారు. ఇలా మండలంలోని అన్ని బూత్‌ల్లో ఇంకా ఎన్ని ఉంటాయోనని ప్రతిపక్ష పార్టీల నాయకులు విమర్శిస్తున్నారు.



చనిపోయిన వారు ఉన్న ఓటరు లిస్టు

- అనుకూలించని ప్రకృతి
- గణనీయంగా తగ్గిన దిగుబడి
- పెట్టుబడి కూడా రాలేదంటున్న రైతన్నలు
- కౌలు రైతుల పరిస్థితి ఆగమ్యగోచరం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు

నిండా మునిగిన శనగ రైతు

మైలవరం, ఫిబ్రవరి 6: శనగ పంట రైతన్నలను నట్టేట ముంచింది. వర్షాభావం, ప్రకృతి అనుకూలించకపోవడంతో పంట దిగుబడి గణనీయంగా తగ్గింది. పెట్టిన పెట్టుబడులు సైతం చేతికి అందక అన్నదా తలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

జిల్లాలో ఈ ఏడాది శనగ విత్తనం సాగు చేసే సమయానికి వర్షాలు సరిగా పడకపోయినా.. ఎక్కడ అదును దాటిపోతుందోనని అరకొర



మైలవరంలో సాగు చేసిన శనగపంట

పదనుకే విత్తనం విత్తారు. గత ఏడాది 1.60 లక్షల ఎకరాలకు పైగా శనగ పంట సాగైతే.. లక్ష ఆరు వేల ఎకరాలలో మాత్రమే సాగైంది. అధికంగా మెట్ట ప్రాంతం, నల్లరేగడి ప్రాంతాల్లో పంట సాగు చేశారు. జిల్లాలో అధికంగా పెద్దముడియం మండలంలో 11,600 హెక్టార్లలో, కమలాపురంలో 4వేల హెక్టార్లు, రాజుపాలెం 3,900 హెక్టార్లు, జమ్మలమడుగులో 4 వేల హెక్టార్లు, సింహాద్రిపురం 3200 హెక్టార్లు, వీరపునాయునిపల్లె 2400 హెక్టార్లు, ఎర్రగుంట్ల 3300 హెక్టార్లు, మైలవరం మండలంలో 2200 హెక్టార్లలో అధికంగా శనగ పంట సాగు చేశారు. మైలవరం మండలంలోని చిన్నవెంతుర్ల, నవాబుపేట, కల్లుట్ల, బెస్తవేముల, వద్దిరాల, తలమంచిపట్నం తదితర గ్రామాలలో రైతులు పంట సాగు చేశారు. పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు సక్రమంగా పడకపోవడం, ప్రకృతి అనుకూలించిక తెగుళ్లు ఆశించడంతో పంట సాగు చేసిన రైతులు తీవ్రంగా నష్టపోయారు.

తీవ్రంగా నష్టపోయాం



నేను 8 ఎకరాలలో శనగ పంట సాగు చేశా. నా సొంత పొలం 4 ఎకరాలు ఉండగా, మరో 4 ఎకరాలు దాదాపు రూ.40 వేలకు కౌలుకు తీసుకుని సాగు చేశా. ఎకరాకు 1.50 క్వింటాళ్ల శనగలు అయ్యాయి. పంట కోత కోయడానికి ఎకరాకు రూ.1600.. నూర్పిడి యంత్రానికి ఎకరాకు రూ.1300 చెల్లిస్తున్నాం. వర్షాలు సమయానికి పడకపోవడంతో దిగుబడి గణనీయంగా తగ్గి తీవ్రంగా నష్టపోయాం.

\- మల్లయ్య, రైతు నవాబుపేట

పెట్టుబడి కూడా రాలేదు...

శనగ పంట సాగుకు ఎకరాకు రూ.13 నుంచి 16 వేల వరకు పెట్టుబడి పెట్టారు. శనగ విత్తనాలు, దుక్కులు, రసాయనిక ఎరువులు, పురుగు మందుల పిచికారి, శనగ నూర్పిళ్ల తదితర ఖర్చులు కలుపుకుని ఎకరాకు దాదాపు రూ.15వేల వరకు రైతులు పెట్టుబడులు పెట్టారు. వర్షాలు సరిగా పడకపోవడంతో పంట దిగుబడి బాగా తగ్గిపోయింది. ఎకరాకు 1, 2 బస్తాలు మాత్రమే కావడంతో పెట్టిన పెట్టుబడి కూడా రాలేదు. మామూలుగా ఎకరాకు 5 నుంచి 7 బస్తాలు అయ్యేవి. దీంతో కొందరు రైతులు పంటను పొలాల్లో వదిలేయలేక శనగ పొట్టు మేతకైనా ఉపయోగపడుతుందని పంట నూర్పిళ్లు చేశామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్వింటా రూ.5,800 నుంచి..

శనగ పంటకు ప్రస్తుతం ధర కూడా అంతంత మాత్రమే ఉంది. కింటా 6 వేలు మాత్రమే ధర ఉండటంతో కౌలు రైతుల పరిస్థితి అధ్వానంగా తయారైంది. ఎకరాకు కౌలు రూ.8వేల నుంచి 10 వేల వరకు ఉండటంతో అప్పులు తెచ్చి కౌలు చెల్లించాల్సి వస్తోందని వాపోతున్నారు. పంట సాగు చేసి నష్టపోయిన రైతులందరికీ ప్రభుత్వం నష్టపరిహారం అందించి ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

ప్రభుత్వం ఆదుకోవాలి



ఈ ఏడాది పదును కాకపోయిన వర్షం వస్తుందని ఆశతో శనగపంటను 3 ఎకరాలలో సాగు చేశా.. దాదాపు రూ.45 వేలు ఖర్చు పెట్టాను. ఎకరాకు రెండు బస్తా శనగలు మాత్రమే అయ్యాయి. 45 వేలు శనగ సాగుకు ఖర్చు పెడితే రూ.36 వేలు మాత్రమే వస్తోంది. ఇలాగైతే రైతులు బతికేదెలా.. కౌలు రైతుల పరిస్థితి అధ్వాన్నంగా మారింది. ప్రభుత్వం శనగ రైతులను ఆదుకోవాలి.

\- తాటి సుబ్బరాయుడు, రైతు,



శనగపంట నూర్పిడి చేస్తున్న మిషన్



శనగలను సంచులలో నింపుతున్న రైతులు

గుర్తు తెలియని వాహనం ఢీ... మాజీ సర్పంచ్ దుర్మరణం



గురుభాస్కర్ మృతదేహం

జమ్మలమడుగు, ఫిబ్రవరి 6: జమ్మలమడుగు-ప్రొద్దుటూరు రోడ్డులోని బైపాస్ వద్ద మంగళవారం తెల్లవారుజామున 5.30 గంటల సమయంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ పోతనబోయిన గురుభాస్కర్ మృతి చెందాడు. పోలీసుల వివరాల మేరకు.. జమ్మలమడుగు మండలంలోని గండికోట గ్రామానికి చెందిన గురుభాస్కర్ ప్రస్తుతం పట్టణంలోని ట్యాంకు వీధిలో నివశిస్తున్నాడు. మంగళవారం తెల్లవారుజామున తన ద్విచక్ర వాహనంలో పని నిమిత్తం ప్రొద్దుటూరుకు బయల్దేరి వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొంది. దీంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. అక్కడున్న వారు గమనించి వెంటనే కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో వారు ఘటనా స్థలానికి వెళ్లి బోరున విలపించారు. మృతదేహాన్ని జమ్మలమడుగు ప్రభుత్వాఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. మృతుడు గురుభాస్కర్ గండికోట గ్రామ సర్పంచ్‌గా 2013-2018 వరకు కొనసాగినట్లు బంధువులు తెలిపారు. ఈయనకు భార్య మహేశ్వరి, ఒక కుమారుడు, కూతురు ఉన్నారు. ఈమేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

రూ.45 లక్షలు నగదు పట్టివేత



పట్టుబడిన నగదును చూపుతున్న పోలీసులు

గోపవరం, ఫిబ్రవరి 6: గోపవరం పీపీ కుంట చెక్‌పోస్టు వద్ద మంగళవారం పోలీసులు తనిఖీలు నిర్వహించి రూ.45లక్షలు స్వాధీనం చేసుకున్నారు. ఎటువంటి ఆధారాలు లేకుండా డబ్బులు తరలిస్తున్నట్లు సమాచారం అందడంతో బద్వేలు రూరల్ సీఐ విక్రమసింహ, ఎస్ఐ రవి కుమార్‌లు తమ సిబ్బందితో తనిఖీలు చేపట్టారు. నెల్లూరు నుంచి బద్వేలుకు వస్తున్న ఆర్టీసీ బస్సులో బద్వేలు పట్టణానికి చెందిన నరసింహ అనే వ్యక్తి వద్ద ఉన్న రూ.45 లక్షలు స్వాధీనం చేసుకున్నారు. నగదుకు సంబంధించి ఎటువంటి ఆధారాలు చూప కపోవడంతో అతన్ని అరెస్టు చేశారు. పట్టుబడిన నగదును ఇన్‌కమ్ ట్యాక్స్ అధికారులకు అప్పగిస్తామని మైదుకూరు డీఎస్పీ వంశీధర్‌గౌడ్ తెలిపారు.

కొండాపురం మండలంలో రూ. 19.70 లక్షలు...



సీజ్ చేసిన నగదుతో కొండాపురం ఎస్ఐ యోగీంద్ర, సిబ్బంది

కొండాపురం, ఫిబ్రవరివరి 22: మండలంలోని జిల్లా ముచ్చుమర్రి పునరావాస కేంద్రం వద్ద మంగళవారం సాయింత్రం పోలీసులు రూ.10,00,000 లక్షల నగదు సీజ్ చేశారు. కొండాపురం ఎస్ఐ యోగీంద్ర ఆధ్వర్యంలో వాహనాల తనిఖీలు నిర్వహిస్తుండగా ఈనగదును స్వాధీనపరచుకున్నారు. అనంతపురం నుంచి జమ్మలమడుగుకు కారులో వెళుతుండగా రమేష్‌కుమార్ అనే వ్యక్తి నుంచి ఈ మొత్తాన్ని స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా సుగుమంచిపల్లె చెక్‌పోస్టు వద్ద తాళ్లప్రొద్దుటూరు ఎస్ఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో వాహనాలు తనిఖీలు నిర్వహిస్తుండగా ప్రొద్దుటూరు నుంచి హైదరాబాద్‌కు కారులో నగదు తీసుకెళుతున్న ఆసీఫ్ ఖైతన్ అనే వ్యక్తి నుంచి రూ.9,50,000లు స్వాధీనం చేసుకున్నారు. ఈ నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపకపోవడంతో నగదును సీజ్ చేసినట్లు తెలిపారు.

విద్యుత్ కంచె తగిలి వ్యక్తి మృతి కేసులో నిందితుల అరెస్టు



నిందితులను చూపుతున్న పోలీసు సిబ్బంది

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 4: మండల పరిధిలోని కొర్లకుంట చెరువు పరిధిలో పొలానికి తీసిన విద్యుత్ కంచె తగిలి వ్యక్తి మృతి చెందిన విషయం విధితమే.. కోడూరు మండలం బొజ్జవారిపల్లె పంచాయతీ బంగ్లామిట్టకు చెందిన తుపాకుల సుబ్రహ్మణ్యం అలియాస్ చత్రపతి (35) వేటకు వచ్చి.. కొర్లకుంట చెరువు పరిసరాలలో అడవి జంతువుల వేట కోసం అక్రమంగా తీసిన విద్యుత్ కంచెకు తగిలి మృతి చెందాడు. ఈకేసులో నిందితులైన అనంతరాజుపేట పంచాయతీకి చెందిన సుధాకర్, లక్ష్మయ్య, రామయ్య, గంగాధర్‌లను మంగళవారం సాయంత్రం అరెస్టు చేసినట్లు సీఐ మధుసూదన్‌రెడ్డి, ఎస్ఐ చిన్నపెద్దయ్య తెలిపారు. వీరి వద్ద నుంచి విద్యుత్ వైరు, మోటారు సైకిల్ ను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

అప్పులబాధతో వ్యక్తి ఆత్మహత్య

పెద్దముడియం, ఫిబ్రవరి 6: మండల పరిధిలోని బోడితిప్పనపాడు గ్రామంలో మంగళవారం ఉలసాల వెంకటసుబ్బయ్య అనే వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన చోటు చేసుకుంది. బంధువులు, గ్రామస్తుల వివరాల మేరకు.. కుటుంబ అవసరాల కోసం అప్పులు చేసిన వెంకటసుబ్బయ్య అప్పులు తీర్చేమార్గం లేకపోవడంతో శివారులో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన బంధువులు పెద్దముడియం పోలీసులకు సమాచారం అందించారు. బంధువుల ఫిర్యాదు మేరకు పెద్దముడియం పోలీసులు కేసు నమోదు చేశారు.

బకాయిలను ప్రభుత్వం వెంటనే చెల్లించాలి

- ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న దామోదరరావు

బద్వేలు, ఫిబ్రవరి 6: ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించాలని ఏపీ పీటీడీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు పి.దామోదరరావు పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఎన్‌జీవోహోంలో ఏపీపీడీఎఫ్ ఎంప్లాయిస్ యూనియన్ బద్వేలు డిపో నాయకత్వంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం అయిన తర్వాత ఉద్యోగ హక్కుల కోసం నిరంతరం రాజీలేని పోరాటాలు చేసిన ఏకైక అసోసియేషన్ ఎంప్లాయిస్ యూని యన్ అన్నారు. ప్రభుత్వంలో విలీనం జరిగిన తర్వాత కొన్ని నష్టాలు జరిగినప్పటికీ.. లాభాలు కూడా ఉన్నాయని.. ఉద్యోగులు ఈవిషయాన్ని గమనించాలన్నారు. ఉద్యోగులకు జీతభత్యాలు, ఇంక్రిమెంట్లు, పనిభారం విషయంలో ఉద్యోగుల పక్షాన నిలబడి ప్రభుత్వంతో చర్చించి న్యాయం జరిగేలా ముందుకు పోతున్నామన్నారు. ప్రభుత్వం విడుదల చేసిన 71,72 జీవోలు ఉద్యోగులను ఇబ్బంది పెట్టేలా ఉన్నాయని.. మేనేజింగ్ డైరెక్టర్ ఇచ్చిన హామీని పక్కనపెట్టేలా అధికారులు ప్రవర్తిస్తున్నారని ఆయన పేర్కొన్నారు. గత ఎండీ ఇచ్చిన జీఓనే అమలు చేసి ఉద్యోగులకు భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. అనంతరం డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు బోసుబాబు, మూర్తిలు మాట్లాడుతూ జిల్లాలో తగ్గించిన సర్వీసులను, పనిష్మెంట్ల విషయాలపై జిల్లా అధికారులు దృష్టిసారించి వారి సర్వీసులను పునరుద్ధరించాలన్నారు. మహిళా విభాగం జిల్లా కార్యదర్శి విజయమ్మ మాట్లాడుతూ మహిళా ఉద్యోగులకు సంబంధించి ఏ సమస్య వచ్చినా పరిష్కరించేందుకు తన వంతు కృషి చేస్తామన్నారు. అనంతరం వైఎస్సార్ ట్రేడ్ యూనియన్‌కు సంబంధించిన కార్మికులు, ఎంప్లాయిస్ యూనియన్‌లో చేరారు. కార్యక్రమంలో రీజనల్ కమిటీ మెంబర్ కృష్ణారెడ్డి, డిపో అధ్యక్ష, కార్యదర్శులు నరసింహ, కొండయ్య పాల్గొన్నారు.

పగటిపూట వీధిలైట్లను ఆపకపోతే చర్యలు తప్పవు

- జిల్లా విద్యుత్ శాఖాధికారి రమణ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఈ రమణ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6: జిల్లాలోని పలు గ్రామాల్లో, పట్టణాల్లో వీధిలైట్లు పగటిపూట కూడా వెలుగుతున్నాయని... వెంటనే చర్యలు తీసుకోకపోతే చర్యలు తప్పవని జిల్లా విద్యుత్ శాఖాధికారి రమణ అధికారులకు హెచ్చరికలు జారీ చేశారు. మంగళవారం ఆయన ఎర్రగుంట్ల, వీరపునాయునిపల్లె, కమలాపురం మండలాల విద్యుత్ కార్యాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అయ్యవారుపల్లె, 33/11 సబ్‌స్టేషన్‌ను, పాలగిరిలోని ట్రాన్స్‌ఫార్మర్లను తనిఖీ చేసినట్లు తెలిపారు. ఎక్కడైనా పగటిపూట వీధిలైట్లు వెలుగుతున్నాయని నా దృష్టికి వస్తే ఇకపై ఊరుకోనన్నారు. ఒక్క యూనిట్ విద్యుత్ కూడా వృధా కాకూడదన్నారు.

రానున్న వేసవి కాలంలో నాణ్యమైన విద్యుత్తు అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసు కుంటున్నట్లు తెలిపారు. అవసరమైన చోట కొత్త ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. అంతరాయాలు అధికంగా ఉన్నా యని... నిర్లక్ష్యంవీడి లైన్ల వెంబడి తిరగాలన్నారు. లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్స్‌కు అడ్డుగా ఉన్న కొమ్మలను వెంటనే తొలగించాలని ఆదేశించారు. రైతుల విద్యుత్ సమస్యలపై సత్వరం స్పందించా లన్నారు. వినియోగదారుడు విద్యుత్ సమస్యలపై వచ్చినప్పుడు మర్యాద పూర్వకంగా స్పందించాలన్నారు. విద్యుత్ చౌర్యాన్ని అరికట్టేందుకు వెంటనే చర్యలకు ఉపక్రమించాలన్నారు. భద్రత నియమాలు పాటించని సిబ్బందిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శ్రీనివాసులరెడ్డి, సబ్‌డివిజన్ డీఈఈ కిరణ్, విద్యుత్ రెవెన్యూ అధికారి రాధమ్మ, ఏఈలు సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి ఉపయోగపడే సివిల్ సర్వీసెస్ కావాలి

- సివిల్స్ మెంటార్ బాలలత



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న బాలలత

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6: సమాజానికి ఉపయోగపడే సివిల్ సర్వీసెస్ కావాలని సివిల్స్ మెంటార్ బాలలత పేర్కొన్నారు. రైల్వేకోడూరులోని విజయ కన్వెన్షన్ హాలులో మంగళ వారం ప్రైవేటు పాఠశాలల ఆధ్వర్యంలో పది పరీక్షలకు విద్యార్థులు ఎలా సిద్ధం కావాలనే అంశంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 10వ తరగతి విద్యార్థులు పరీక్షలు ఎలా రాయాలి, తమ లక్ష్యాలను ఎలా చేరాలనే అంశా లపై అవగాహన కల్పించారు. ఏయే గ్రూపులు తీసుకోవాలి, ఎలా ప్రిపేర్ కావాలి, ఎంత సమయం కేటాయించాలి, బుక్కులు ఎలా చదవాలి తదితర అంశాలపై క్షుణ్ణంగా విద్యార్థులకు తెలిపారు. చదువు అంటే బీటెక్, ఎంబీబీఎస్ కాదని... సమాజానికి ఉపయోగపడే సివిల్ సర్వీసెస్ కావాలని తెలిపారు. మన మేధస్సు వేరే దేశాలకు వెళ్లిపోకూడదన్నారు. మన జీవితంలో కొంత మందికైనా సేవ చేయాలని వివరించారు. నా జీవితం పిల్లలకు ఒక పాఠం కావాలన్నారు. పిల్లలకు అన్ని అవయయాలు ఉండి సక్రంగా చదవటం లేదని ఆందోళన వ్యక్తం చేశారు. ఆ రోజుల్లో నేను ఒక ఆడ బిడ్డ అయి ఉండి రెండు కాళ్లు పని చేయకపోయినా.. ఏస్కూల్లో చదవకపోయినా.. జీవితంలో సమాజానికి ఏదో ఒకటి చేయాలని.. అందరూ నా గురించి మాట్లాడుకునేలా సివిల్ సర్వీసెస్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగం సాధించానన్నారు. అలాగే హైద్రాబాద్‌లో సివిల్స్ కోచింగ్ సెంటర్‌ను స్థాపించి వందల మందిని కలెక్టర్లు, ఎస్పీలు, ఆర్డీవోలుగా ఎంపికయ్యేలా శిక్షణ ఇచ్చానని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారి పురు షోత్తం, ఎంఈవో సుందర్‌బాబు, ప్రైవేటు పాఠశాలల యూనియన్ ఉపాధ్యక్షుడు విక్టరీ నరసింహరెడ్డి, జిల్లా కార్యదర్శి రాజశేఖర్, నియోజకవర్గ ప్రెసిడెంట్ ఎంపీ కుమార్, ప్రైవేటు పాఠశాలల అధినేతలు కంచిరాజు చెంగల్ రాజు, ప్రదీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జంతు నమూనాలతో పరిశోధనలు సాగించాలి

- వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ చింతా సుధాకర్

కడప (ఎడ్యుకేషన్), ఫిబ్రవరి 6: మానవ వ్యాధుల అధ్యయన పరిశోధనలో జంతువుల స్థానంలో వాటి నమూనాలను వినియోగించాలని వైవీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసరు చింతా సుధాకర్ స్పష్టం చేశారు. జంతువులను ఉపయోగించేటప్పుడు 3 ఆర్ (రీప్లేస్‌మెంటు, తగ్గింపు, శుద్ధీకరణ) వ్యూహాన్ని నొక్కిచెప్పారు. మానవ వ్యాధుల అధ్యయనం కోసం జంతు నమూనాలు, నైతిక విలువలు, ప్రత్యామ్నాయ మార్గాలు అనే అంశంపై జరిగిన సెమినార్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంప్యూటరు ప్రోగ్రాంలు పెరగుతున్న నేపథ్యంలో మానవ శరీరంలోని కొన్ని అంశాలను మోడల్ చేయగల సామర్థ్యం గతంలో కంటే సులభంగా మారిందన్నారు. ఆ మోడళ్లను ఉపయోగించి జంతువులకు ప్రత్యామ్నాయంగా పరిశోధనలు చేయాలన్నారు. గత కొన్నేళ్లుగా క్లినికల్, బయో మెడికల్ పరిశోధనలో జంతు పరీక్ష నమూనాలను భర్తీ చేయడానికి అనేక ప్రత్యామ్నాయ పద్ధతులు అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. సెల్ ఆధారిత పరీక్షలు, మైక్రోఫ్లూయిడ్ చిప్స్ కణజాల నమూనాలు, కంప్యూటరు నమూనాలు, మానవశరీర దాతలు, మానవకణం, కణజాల ఆధారిత పరీక్షల ద్వారా పరిశోధనలు చేయవచ్చన్నారు. 20 ఏళ్ల కిందటే ఇంటర్మీడియట్ విద్యలో ప్రయోగాల కోసం జంతువులను నిషేధించారని తెలిపారు. అనంతరం రిజిస్ట్రార్ వైపీ వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపల్ రఘునాథరెడ్డి, సెమినార్ కన్వీనరు ఎన్.వెంకటసుబ్బ రామిరెడ్డి మాట్లాడారు. కార్యక్రమంలో సభ్యులు వెంకటరమణ, అనుప్రసన్న, వెంకటరమణారెడ్డి, ఏఎస్పీ మరియదాస్, మనస్వి, పరిశోధకులు, అధ్యాపకులు విద్యార్థులు పాల్గొన్నారు.

వంద మద్యం బాటిళ్లు స్వాధీనం

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6: రాయచోటి పట్టణంలోని ఎస్ఎన్‌కాలనీ చెక్ పోస్టు వద్ద వాహనాల తనిఖీలో 100 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని.. ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ సుధాకర్‌రెడ్డి తెలిపారు. మిట్టావాండ్లపల్లెకు చెందిన రాజా అనే వ్యక్తి మద్యం బాటిళ్లు తీసుకెళుతుండగా అరెస్టు చేసి.. మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. రాజా ప్రభుత్వ మద్యం దుకాణంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ తెలియజేశారు.

జీఎన్ఎస్ఎస్ స్పెషల్ కలెక్టర్‌గా కౌసర్‌భాను

కడప(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: గాలేరి నగరి సుజల స్రవంతి వైఎస్సార్ కడప జిల్లా స్పెషల్ కలెక్టర్‌గా కె.కౌసర్‌భానును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ సెక్రటరీ డాక్టర్ జవహర్ రెడ్డి మంగళవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈమె కడప జీఎన్ఎస్ఎస్ యూనిట్-2 డిప్యూటీ కలెక్టర్‌గా (కడప)పని చేస్తూ అదే శాఖకు స్పెషల్ కలెక్టర్‌గా పదోన్నతిపై విధులు నిర్వహించనున్నారు.

వృద్ధురాలిపై జాలిచూపని సచివాలయ సిబ్బంది



తిప్పలూరు సచివాలయం వద్ద కదల్లేని స్థితిలో ఉన్న మరియమ్మ

ఎర్రగుంట్ల, ఫిబ్రవరి 6: కదల్లేని స్థితిలో ఉన్న ఓ వృద్ధురాలిపై కనీసం దయచూపకుండా, నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంఘటన మండలంలోని తిప్పలూరు సచివాలయం వద్ద మంగళవారం చోటు చేసుకుంది. వృద్ధురాలి కుమారుడు శ్రీను వివరాల మేరకు.... నా తల్లి మరియమ్మకు 1.5 సెంట్ల స్థలాన్ని రెండేళ్లక్రితం ఇచ్చారు. జగనన్న స్థలం రిజిస్ట్రేషన్‌కు నేడు చివరి తేదీ అని వలంటీర్ సువర్ణ ఫోన్ ద్వారా తెలపడంతో మా అమ్మను అతికష్టం మీద సచివాలయానికి తీసుకెళ్లాం. మా తల్లి ఆరోగ్య పరిస్థితి బాగా లేదని.. వెంటనే రిజిస్ట్రేషన్ చేయాలని ఆపరేటర్‌ను అడిగితే... వీఆర్‌వో లేనిది మేమేం చేయలేమంటూ నిర్లక్ష్యంగా సమాధానం చెప్పారు. వీఆర్‌వోకు ఫోన్ చేయగా.. ఎర్రగుంట్ల తహసీల్దార్ కార్యాలయంలో ఉన్నానని చెప్పడంతో అక్కడికి వెళ్లి ఫోన్ చేయగా ఫోన్ ఎత్తలేదు. మళ్లీ సచివాలయానికి వచ్చి.. ఆరోగ్యం సరిగాలేదన్నా పట్టించుకోరా... అని ప్రశ్నించడంతో సచివాలయ సిబ్బంది వాగ్వాదానికి దిగారు. ఇంతలో వీఆర్‌వో శారద అక్కడికి వచ్చి సర్వర్ పనిచేయడం లేదు. మేమేం చేయాలంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇస్తూ....సర్వర్ పని చేసినప్పుడు రావాలంటూ సమాధానం చెప్పిందని బాధితుడు పేర్కొన్నారు. జరిగిన సంఘటనపై వీఆర్‌వో శారద వివరణ ఇస్తూ... సచివాలయంలో సర్వర్ పనిచేయలేదు కాబట్టి రిజిస్ట్రేషన్ చేయలేకపోయాం. ఈ నెల 15వరకు గడువు ఉందని తెలిపారు.



గద్దలరేవు పల్లెలో 'భవిష్యత్తుకు గ్యారెంటీ'



కరపత్రాలు పంపిణీ చేస్తున్న టీడీపీ నేతలు

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 6 : మండలంలోని గద్దలరేవు పల్లె గ్రామ పంచాయతీలో మంగళవారం భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల టీడీపీ అధ్యక్షుడు వెంకటేశ్వరరాజు టీడీపీ మేనిఫెస్టోపై ప్రజలకు అవగాహన కల్పించారు. తెలుగు దేశం పార్టీ మహిళలకు అండగా ఉంటుందని బి.కమ్మ పల్లె టీడీపీ నాయకుడు చప్పిడి రమేష్‌బాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాయలవారిపల్లె, బి.పి.రాజుపల్లె టీడీపీ నాయకులు, అభిమానులు, మహిళా నాయకురాలు అనిత దీప్తి, శాప్ మాజీ డైరెక్టర్ దుద్యాల జయచంద్ర, గద్దల రేవుపల్లి టీడీపీ నాయకులు శ్రీధర్ రాజు, జయచంద్రరాజు తదితరులు పాల్గొన్నారు.

ఈఆర్‌వోగా లీలారాణి



రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6: నియోజకవర్గ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా బి. లీలారాణి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేస్తున్న ఈ. మల్లికార్జునరెడ్డి నంద్యాలకు బదిలీ అయ్యారు. ఎన్నికల నోటిఫికేషన్ తర్వాత ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తా రని రెవెన్యూ అధికారులు తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న బీజేపీ నాయకులు

సుండుపల్లె, ఫిబ్రవరి 6: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి నాగోతు రమేశ్‌నాయుడు ఆధ్వర్యంలో రెండో రోజు అన్నదానం నిర్వహించినట్లు బీజేపీ కిసాన్ మోర్చా జోనల్ ఇన్‌చార్జి వెంకటరామరాజు తెలిపారు. మంగళవారం మండల కేంద్రంలోని బస్టాండు వద్ద రెండో రోజు 190 మందికి అన్నదానం చేశామన్నారు. ఈ కార్యక్రమం నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాగరాజ, శ్రీనివాసులు, గోపాల్‌రాజు పాల్గొన్నారు.

సుండుపల్లె ఎస్‌ఐగా హుస్సేన్

సుండుపల్లె, జనవరి6: సుండుపల్లె ఎస్‌ఐగా ఎస్‌కేఎం హుస్సేన్ మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న రామకృష్ణారెడ్డి బదిలీ కావడంతో ఆయన స్థానంలో చెన్నకేశవులు బాధ్యతలు స్వీకరించారు. పది రోజుల్లో ఆయన రాజంపేటకు బదిలీ కావడంతో పులివెందుల నుంచి వచ్చిన హుస్సేన్ సుండుపల్లె ఎస్‌ఐగా బాధ్యతలు స్వీకరించారు.

బాల్య వివాహాలు నేరం

రామాపురం, ఫిబ్రవరి 6: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని రామాపురం ఎస్‌ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కల్పనాయునిచెరువు పంచాయతీ మూగిరెడ్డిగారిపల్లెలో మంగళవారం ఆయన మాట్లాడుతూ చిన్న వయసులోనే వివా హాలు చేస్తే చర్యలు తీసుకుంటామన్నారు. మద్యం తాగి, హెల్మెట్ లేకుండా వాహనాలు నడపకూడదన్నారు. వాహనాలు నడిపేటప్పుడు సంబంధిత రికార్డులు కలిగి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వైష్ణవి, వెంకట్రామిరెడ్డి, చెన్నారెడ్డి, జనార్దన్‌రెడ్డి, రాంమోహన్‌రెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, డ్వాక్రా మహిళా సంఘాలు పాల్గొన్నారు.

ఆంజనేయస్వామికి పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6: పట్టణంలోని పురాతన ఆంజనేయస్వామి ఆలయంలో మంగళవారం పాలతో అభిషేకం చేశారు. ఆలయంలో ఉన్న వినాయకుడు, నవగ్రహాలు, నాగమ్మ తదితర విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ ధర్మకర్త కలపాటి వెంకటేశ్వర్లు భక్తులకు తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు.

ఆక్రమణల బారిన హైవే..



బస్టాండు రోడ్డులో పండ్ల దుకాణాలు, వాహనాలు

- ట్రాఫిక్ సమస్యతో ప్రజలు సతమతం
- పట్టించుకోని పంచాయతీ అధికారులు, పోలీసులు...

రైల్వేకోడూరు(రూరల్) డిసెంబరు 30: పట్టణంలో రోజురోజుకు ట్రాఫిక్ సమస్య పెరిగిపోతుండడంతో ప్రజలు వాహనదారులు సతమతమవుతున్నారు. హైవే ఇరువైపులా ఆక్రమణలు పెరగడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బైపాస్ రోడ్డు లేకపోవడంతో తిరుపతి, చెన్నైకి వెళ్లే వాహనాలు పట్టణంలోని ప్రధాన రోడ్డు నుంచి వెళ్లక తప్పని పరిస్థితి. దీంతో ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంటుంది. పండుగలు వచ్చాయంటే పల్లెల నుంచి వచ్చే ప్రజలు వాహనాలతో ప్రధాన రహదారులు కిక్కిరిసిపోతాయి. పట్టణంలోని ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గం, ఎన్టీఆర్ సర్కిల్, చిట్వేల్ రోడ్డు, శివాలయం సర్కిల్, టోల్‌గేటు వద్ద వాహనాల రద్దీ అధికంగా ఉంటుంది. ఫుట్‌పాత్‌ను చిరు వ్యాపారులు, తోపుడు బండ్ల వారు ఆక్రమించడంతో పాదచారులకు సైతం ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఆర్టీసీ బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో ఆక్రమణల కారణంగా ఆర్టీసీ డ్రైవర్లు బస్టాండ్‌కు వెళ్లాలంటే బెంబేలెత్తుతున్నారు. ఈ ఆక్రమణలను తొలగించాలని ఆర్టీసీ అధికారులు మొరపెట్టుకున్నా పంచాయతీ అధికారులు పట్టించుకున్న పాపాన పోలేదు. చర్చి కాంపౌండ్, పాత బజార్‌కు వెళ్లే మార్గంలో ఆక్రమణలు తొలగించాలని చర్చి సభ్యులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా పంచాయతీ అధికారులు ఇప్పటి వరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ప్రమాదాలు జరిగినప్పుడే అధికారులు స్పందిస్తారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు నిద్ర మేల్కొని ఆక్రమణలు తొలగిస్తే ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం లభిస్తుందని ప్రజలు కోరుకుంటున్నారు.



టోల్‌గేట్ వద్ద రోడ్డుపై పార్క్ చేసిన వాహనాలు

పంచాయతీ అధికారులకు స్పందించాలి



దుకాణదారులు రోడ్లను ఆక్రమించడంతో వాహనదారులు ఫుట్‌పాత్‌పై వాహనాలు నిలుపుతున్నారు. దీంతో పాదచారులు ప్రధాన రోడ్డుపై నడిచే పరిస్థితి. పాత బస్టాండ్ సమీపంలోని ప్రధాన రోడ్డుపై బారికేడ్లు తొలగించాలి.

- ఆకేపాటి రంగారెడ్డి

చర్యలు తీసుకుంటాం..



పంచాయతీ అధికారులతో చర్చించి ఆక్రమణలను తొలగిస్తాం. ట్రాఫిక్ ఉండే ప్రదేశాలను గుర్తించి క్రమబద్ధీకరిస్తాం. ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటాం. ట్రాఫిక్‌కు అంతరాయం కల్పిస్తే చర్యలు తప్పవు.

- టి.బాబు, సీఐ

చనిపోయిన వారి పేర్లు తొలగించరా..



ఓటర్ల జాబితా పరిశీలిస్తున్న టీడీపీ నేతలు

రాజంపేట, ఫిబ్రవరి 6: ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా, చనిపోయిన వారి పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించక పోవడం దారుణమని టీడీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం రాజంపేట మండలం పోలి గ్రామ పంచాయతీ 182వ పోలింగ్ బూత్ పరిధిలో చనిపోయిన వారి పేర్లు ఓటర్‌జాబితాలో ఉండటాన్ని వారు అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. చనిపోయిన వారి పేర్లు తొలగించలేదని ఈ విషయమై ఎలక్షన్ కమిషన్‌కు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. మండల టీడీపీ అధ్యక్షుడు గన్నె సుబ్బనరసయ్య నాయుడు, స్థానిక నాయకులు మల్లికార్జునరెడ్డి, పెంచలయ్య, వెంకట రమణరాజు, శంకరయ్య, కొండయ్య, సుబ్బ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు సన్మానం



చంద్రబాబును సన్మానిస్తున్న గాజుల ఖాదర్‌బాషా, మైనార్టీ నేతలు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6: చిత్తూరు జిల్లా జీడీ నెల్లూరులో మంగళవారం జరిగిన బహిరంగ సభలో టీడీపీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును టీడీపీ రాష్ట్ర కార్యదర్శి, కుప్పం నియోజకవర్గ పరిశీలకుడు గాజుల ఖాదర్‌బాషా ఆధ్వర్యంలో టీడీపీ మైనార్టీ నాయకులు ఖాజాపీర్, జాకీర్ ఉమర్ తదితరులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఖాదర్‌బాషా మాట్లాడుతూ వైసీపీ తరపున పోటీ చేసేందుకు ఆ పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర నాయకులు కూడా శ్రద్ధ చూపడం లేదన్నారు. చాలా మంది వైసీపీ ఎమ్మెల్యేలు టీడీపీలోకి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు.

హామీలు అమలు చేయకుంటే సమ్మె : సీఐటీయూ



రాయచోటి మున్సిపల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులు

రాయచోటిటౌన్, ఫిబ్రవరి 6: మున్సిపల్ కార్మికుల సమ్మె కారణంగా ప్రభుత్వం అంగీకరించిన డిమాండ్లకు సంబంధించిన జీవోలను వెంటనే విడుదల చేయాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అబ్బవరం రామాంజులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా పట్టణ కమిటీ అధ్యక్షుడు చెన్నయ్య, ప్రధాన కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ మున్సిపల్ కార్మికులకు ఇచ్చిన హామీలపై వెంటనే జీవోలు విడుదల చేయాలన్నారు. డ్రైవర్లకు రూ.24,500లు, పారిశుధ్య కార్మికులకు రూ.21 వేలు, క్లాప్ ఆటో డ్రైవర్లకు రూ.18,500లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కోవిడ్-19 కార్మికులను ఆపోస్‌లో చేర్చడం, ఇంజనీరింగ్ సెక్షన్‌లో వారికి జీవో ప్రకారం వేతనాలు, టెక్నికల్, నాన్‌టెక్నికల్, స్కిల్డ్, సెమీ స్కిల్డ్ ప్రకారం వేతనాలు వంటి హామీలు ఇచ్చి సమ్మెను విరమింపజేసిందన్నారు. ఇప్పటికి నెల రోజులకు పైగా కావస్తున్నా ప్రభుత్వం వైపు నుంచి ఎటువంటి జీవోలు విడుదల కాలేదన్నారు. దీనిని బట్టి చూస్తే కార్మికుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి మనకు స్పష్టంగా కనపడుతోందన్నారు. జీవోలు విడుదల చేయకుండా కాలయాపన చేస్తే రాబోయే రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళన చేసేందుకు సిద్ధమని ఆయన హెచ్చరించారు. సోమవారంలోగా జీవోలు విడుదల చేయకపోతే సమ్మెలోకి వెళ్లేందుకు కార్మికులంతా సిద్ధం కావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు అగ్గిరామయ్య, వెంకట్రామయ్య, తిరుపతమ్మ, కేశమ్మ, సుహాసిని, రమణమ్మ, సీఐటీయూ నాయకులు మాదవ్, సిద్దమల్లు, సిద్దయ్య, హర్ష, నాగరాజ, లక్ష్మీదేవి తదితరులు పాల్గొన్నారు.

మృతి చెందిన కార్మికుల కుటుంబ సభ్యులకే ఉద్యోగాలు ఇవ్వాలి



కలెక్టరేట్ వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి6: చనిపోయిన కార్మికుల కుటుంబ సభ్యులకు ఉద్యోగం కల్పించాలని అన్నమయ్య జిల్లా మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయూసీ అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాసులు, సురేశ్‌కుమార్ డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మదనపల్లె మున్సిపాలిటీలో ఔట్‌సోర్సింగ్‌లో ఎన్‌వోఎన్‌పీహెచ్ వర్కర్లుగా విధులు నిర్వహిస్తూ ఇటీవల మరణించిన, రిటైరైన కార్మికుల స్థానాల్లో వారి కుటుంబ సభ్యులను నియమించాలని డిమాండ్ చేశారు. మదనపల్లె మున్సిపాలిటీలో ఇందుకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకోవడం సరైంది కాదన్నారు. 30, 40 ఏళ్ల నుంచి మున్సిపాలిటీకి సేవలందిచిన వారి కుటుంబ సభ్యులకు పనులు కల్పించడంలో యూనియన్‌తో సంప్రదించకుండా నిర్ణయాలు తీసుకోవడం ఎంత వరకు సమంజసమో ఆలోచించాలని వారు కలెక్టర్‌ను కోరారు. ఈ కార్యక్రమంలో మదనపల్లి మున్సిపల్ వర్కర్స్ యూనియన్ కార్యదర్శి నాగరాజు, వాసు, గణేశ్, శ్రీనాథ్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

సిద్దవటం కోటలో వైఎంసీఏ ప్రతినిధులు



చరిత్ర వివరిస్తున్న జనసేన నాయకులు

సిద్దవటం, ఫిబ్రవరి 6: మండల కేంద్రంలోని కోటను మంగళవారం రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు, వైఎంసీఏ ప్రతినిధులు సందర్శించారు. రాజంపేట నియోజకవర్గ జనసేన పార్టీ నేత అతికారి కృష్ణ ఆధ్వర్యంలో ముస్లిం మైనారిటీ నేత మహబూబ్ బాషా జగన్ మోహన్‌రెడ్డి, సుబ్బరాయుడు, ఎన్‌ఆర్‌ఐ చలపాటి చంద్ర వారికి కోట విశిష్టతను వివరించారు. జనసేన పార్టీ నాయకులు మస్తాన్, ఆరి ఫ్, జగన్‌మోహన్‌రెడ్డి, సుబ్బరా యుడు, చిన్నకొండ్రు విజయ, పసుపులేటి గంగయ్య, సుబ్బరాయుడు పాల్గొన్నారు.

జనసేన సిద్ధాంతాలపై ప్రచారం

నందలూరు, ఫిబ్రవరి 6 : మండలంలోని ఎగువ కుమ్మరపల్లె, కుమ్మరపల్లె రాచపల్లె, ఇసుకపల్లె, హరిజనవాడల్లో మంగళవారం జనసేన నాయకులు ఇంటింటికి తిరుగుతూ కరపత్రాలను పంపిణీ చేశారు. ఆకుల చలపతి, ప్రశాంత్, తిప్పాయపల్లె ప్రశాంత్, వెలకచర్ల హరిబాబు, మంటి వెంకటసుబ్బయ్య, తదితరులు పాల్గొన్నారు.

వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానికంగా ఉండాలి

నందలూరు, ఫిబ్రవరి 6: మండల ప్రభుత్వ వైద్యులు, వైద్య ఆరోగ్య సిబ్బంది స్థానికంగా నివాసం ఉండాలని హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ అధ్యక్షుడు, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ కమిటీ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డాక్టర్లు ఫ్యామిలీ ఫిజిషియన్ కాన్సెప్ట్ (104)కు తప్పనిసరిగా హాజరు కావాలని, గర్భిణులను పరీక్షించి కాన్పులు చేయాలని సూచిం చారు. అనంతరం ఆసుపత్రిలో వార్డ్, ఫార్మసీ, కాన్పుల గది సందర్శించి శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు.. ఈ సమావేశానికి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, వైద్యాధి కారులు డాక్టర్ శరత్‌కమల్, డాక్టర్ కార్తీక్ విశ్వనాథ్, మండల అభివృద్ధి అధికారి బొక్కే శేఖర్ నాయక్, అన్నమయ్య జిల్లా వక్ఫ్‌బోర్డు కార్యదర్శి సయ్యద్ అమీర్, ఆర్ముగం విశ్వనాథ్, సీహెచ్‌వో వెంకట నారాయణ, ఆరోగ్య కేంద్ర సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

పెద్దఓరంపాడులో వైద్య శిబిరం

ఓబులవారిపల్లె, ఫిబ్రవరి 6 : మండల పరిధిలోని పెద్దఓరంపాడు పంచాయతీలో డాక్టర్ గురు మహేష్, డాక్టర్ దీప హెల్త్‌క్యాంపు నిర్వహించారు. 40 మందికి పరీక్షలు చేసి చికిత్స అందించారు. ఏఎన్‌ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

లక్ష చీరలు పంపిణీకి 'గంటా' ట్రస్ట్ చర్యలు



గంటా చారిటబుల్ ట్రస్ట్ తరపున చీరలందుకున్న బలహీన వర్గాల మహిళలు

రాజంపేట, ఫిబ్రవరి 6: నియోజకవర్గంలో లక్ష చీరలు పంపిణీ చేసేందుకు కృషి చేస్తున్నట్లు గంటా చారిటబుల్ ట్రస్ట్ ప్రతినిధులు భరత్, ప్రసాద్, మహేష్ తెలిపారు. మంగళవారం సాయంత్రం యర్రబల్లి, రామచంద్రాపురం తదితర ప్రాంతాల్లో చీరలు పంపిణీ చేశారు. సుండుపల్లె, వీరబల్లి, సిద్దవటం, నందలూరు, ఒంటిమిట్ట, రాజంపేటల్లో పేద మహిళలకు చీరలు పంపిణీ చేస్తున్నామని, నెల రోజుల్లోగా లక్ష చీరల పంపిణీ పూర్తవుతుందని వివరించారు.

రోడ్డు ప్రమాదంలో విద్యార్థికి తీవ్రగాయాలు

రామాపురం, ఫిబ్రవరి6: కారు స్కూటర్‌ను ఢీకొనడంతో ఓ విద్యార్థికి తీవ్రగాయాలైనట్లు రామాపురం ఎస్‌ఐ బీఎల్ ప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాచపల్లె పంచాయతీ బాలిరెడ్డి గారిపల్లెకు చెందిన వెంకటాద్రి రాయచోటి కళాశాలలో ఎంఎల్‌టీ చదువుతున్నాడు. మంగళవారం సాయంత్రం కాలేజీ నుండి ఇంటికి స్కూటర్‌లో వస్తూ గంగనేరు క్రాస్ వద్ద రోడ్డు దాటుతుండగా రాయచోటి వైపు వెళ్తున్న కారు ఢీకొంది. ఈ సంఘటనలో విద్యార్థి తలకు, కంటికి తీవ్ర గాయాలయ్యాయి. రామాపురం పోలీసులు క్షతగాత్రుడిని 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వైసీపీ హయాంలో దళితవాడల అభివృద్ధి శూన్యం



ప్రచారం చేస్తున్న నగిరిపాటి రేవతి

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6: వైసీపీ హయాంలో దళితవాడల అభివృద్ధి శూన్యమని రైల్వేకోడూరు నియోజకవర్గ టీడీపీ నేత నగిరిపాటి రేవతి విమర్శించారు. మంగళవారం ఓబీపీ అరుంధతివాడ, రాఘురాజపురం అరుంధతివాడ తదితర ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వైసీపీ ఎన్ని కుట్రలు, కుతంత్రాలు చేసినా ప్రజలు టీడీపీ వైపు ఉన్నారన్నారు. దళితులు వైసీపీ ప్రభుత్వంలో దగా పడ్డారన్నారు. ఎస్సీ, ఎస్టీ సబ్ ప్లాన్ నిధులు కూడా పక్కదారి పట్టాయన్నారు. టీడీపీ అధికారంలోకి రాగానే సంక్షేమ కార్యక్రమాలు దళితుల ఇంటి ముందు ఉంటాయన్నారు. పేద, బలహీన, బడుగు వర్గాల అభ్యున్నతి కోసం చంద్రబాబు పాటుపడ్డారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ దళిత నాయకులు తేనేపల్లి చిన్నా, హరి, నగిరిపాటి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి



సుగవాసి బాల సుబ్రమణ్యంను సన్మానిస్తున్న టీడీపీ నాయకులు

సుండుపల్లె, ఫిబ్రవరి 6: చంద్రబాబునాయుడు గెలుపే లక్ష్యంగా టీడీపీ, జనసేన కార్యకర్తలు పనిచేయాలని టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం కోరినట్లు టీడీపీ నాయకులు తెలిపారు. మంగళవారం రాయచోటిలో ఆయనను కలిసినట్లు గ్రామ మాజీ అధ్యక్షుడు చెన్నంశెట్టి వెంకట్రమణ, రామాంజులు, రెడ్డెయ్య, వెంకట్రమణ, జయరాం, నరసింహులు, చెన్నకేశవులు, రామచంద్ర తెలిపారు. కలిసికట్టుగా పనిచేసి టీడీపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తామని హామీ ఇచ్చామన్నారు. మాజీ ఎమ్మెల్యే సుగవాసి పాలకొండ్రాయుడును కలిసినట్లు తెలిపారు.

రాయచోటిటౌన్: రాజంపేట నియోజకవర్గ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు పాలప్రకాశ్ ఆధ్వర్యంలో సంఘం సభ్యులు లక్ష్మీనారాయణ, శ్రీనివాసులు, రమేశ్ మంగళవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో టీడీపీ నేత సుగవాసి బాలసుబ్రమణ్యం, ఆయన సోదరుడు సుగవాసి ప్రసాద్‌బాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాలతో సత్కరించారు. సార్వత్రిక ఎన్నికలపై చర్చించారు.

ఆశ కార్యకర్తలకు అలవెన్సు బకాయిలు చెల్లించాలి



నినాదాలు చేస్తున్న ఆశ కార్యకర్తలు

రైల్వేకోడూరు (రూరల్), ఫిబ్రవరి 6: ఆశ కార్యకర్తలకు అందాల్సిన అలవెన్సు బకాయిలు వెంటనే చెల్లించాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి రాజమ్మ, రైల్వేకోడూరు అధ్యక్షురాలు రత్నమ్మ డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని అనంతరాజుపేట పంచాయతీ తంబిళ్లవారిపల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వద్ద వారు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నాలుగున్నరేళ్లుగా లెప్రసీ, మలేరి యా, టీబీ, కరోనా, ట్యూబెక్టమీ అలవెన్సులు పెండింగ్‌లో ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. అలవెన్సులు ఇచ్చే వరకు ఆందోళన ఆగదని తెలిపారు. ప్రభుత్వం మొండి వైఖరి వీడకుంటే ఆందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. అనంత రం శెట్టిగుంట, తంబిళ్లవారి పల్లె ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న వైద్యులకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

'మా భూములు దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నారు'



ఆవేదన వ్యక్తం చేస్తున్న సుండుపల్లె వాసులు

రాయచోటి(కలెక్టరేట్), ఫిబ్రవరి 6: దౌర్జన్యంగా మా భూములు ఆక్రమిస్తున్నారని సుండుపల్లె మండలం కోనలోవాండ్లపల్లెకు చెందిన హైమోదర్ అనే యువకుడు మంగళవారం జిల్లా కలెక్టర్ అభిషిక్త్‌కు ఫిర్యాదు చేశాడు. వివరాలిలా ఉన్నాయి. తమ అధీనం ఉన్న సర్వే నెంబర్లు 1006/1, 1006/2, 1006/3లోని 8 ఎకరాల పొలాన్ని బండి ఎర్రమ్మ భర్త చిన్నప్ప పేరుతో ఆన్‌లైన్ చేసుకున్నారని, కులాన్ని అడ్డు పెట్టుకుని తమను బెదిరిస్తున్నాడని, అర్జీలో పేర్కొన్నారు. ఈ విషయంపై పూర్తిగా విచారించి న్యాయం చేయాల్సిందిగా అర్జీదారుడు కలెక్టర్‌కు మొరపెట్టుకున్నాడు.

నర్సరీ నిర్వహణకు అనుమతులు తప్పనిసరి



నోటీసులు అందజేస్తున్న ఉద్యానశాఖ అధికారి

చిన్నమండెం, ఫిబ్రవరి 6: నర్సరీల నిర్వాహకులు లైసెన్సులు పొందాలని మండల ఉద్యానశాఖ అధికారి సురేశ్‌బాబు తెలిపారు. మంగళవారం దేవగుడిపల్లెలో కూరగాయల నర్సరీలను తనిఖీ చేశారు. లైసెన్సులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తున్న వారికి నోటీసులు జారీ చేశారు. నిబంధనల ప్రకారం ఫారం-ఏతో పాటు వెయ్యి రూపాయలు చలానా చెల్లించి భూమి పాస్ పుస్తకం, నర్సరీ లేఅవుట్, భూమి లీజు తీసుకున్నట్లయితే లీజు నకలు, మట్టి, నీటి నమూనా రిపోర్టులతో ఉద్యానశాఖ అధికారికి దరఖాస్తు చేసుకొని అనుమతులు పొందాలని తెలిపారు. ఇకపై లైసెన్సులు లేకుండా నర్సరీలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. విత్తన కొనుగోలు రిజిస్టరు, నారు అమ్మకపు రిజిస్టర్, చేపట్టిన సస్యరక్షణ వివరాలు రిజిస్టర్‌లో తప్పనిసరిగా నమోదు చేయాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీఈవో కుమారి పాల్గొన్నారు.

కాలానుగుణంగా ప్రతిభ పెంపొందించుకోవాలి



ప్రసంగిస్తున్న స్పెషల్ జుడిషియల్ మేజిస్ట్రేట్ పసుపులేటి శంకర్

రాజంపేట టౌన్, ఫిబ్రవరి 6 : మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు ప్రతిభా పాటవాలు పెంపొందించుకోవాలని రాజంపేట స్పెషల్ జ్యుడిషియల్ మేజిస్ట్రేట్ డాక్టర్ పసుపులేటి శంకర్ సూచించారు. రాజంపేట మండలం ఆకేపాడులోని జవహర్ నవోదయ విద్యాలయంలో మంగళవారం నిర్వహించిన దేశ భక్తి, వ్యక్తిత్వ వికాసం, నైపుణ్యం అనే అంశాలపై నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సంకల్ప బలం, ఓర్పు, ఆసక్తి కలిగిన విద్యార్థి జీవితంలో తప్పక రాణిస్తాడన్నారు. ప్రిన్సిపాల్ గీత, విశ్రాంత తహసీల్దారు జయన్న, కేంద్ర పురావస్తు శాఖ విశ్రాంత ఉద్యోగి రామాంజనేయులు, అల్విన్ కర్మాగార విశ్రాంత ఉద్యోగి బాలాజీరావు తదితరులు ప్రసంగించారు.

గురుకులంలో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

నందలూరు, ఫిబ్రవరి 6: మండలంలోని ఆడపూరు పంచాయతీ పరిధిలోని డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఐదవ తరగతి, ఇంటర్మీడియట్ (ఇంగ్లీష్ మీడియం)లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ నాగమణి తెలియజేశారు. ఇందుకు సంబంధించిన ప్రవేశ పరీక్ష మార్చి ఐదవ తేదీన ఉంటుందన్నారు. ఐదవ తరగతి ప్రవేశానికి 4వ తరగతి చదువుతున్న వారు, ఇంటర్మీడియట్ ప్రవేశానికి పదవ తరగతి చదువుతున్న వారు అర్హులన్నారు. ఉమ్మడి వైఎస్సార్ జిల్లాకు చెందిన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ నెల 23వ తేదీలోపు దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఎలాంటి ఫీజులు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. మరిన్ని వివరాలకు 9704550128 నెంబర్‌ను సంప్రదించాలని తెలిపారు.

కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు కోసం గోశాల దేవి దరఖాస్తు

రైల్వేకోడూరు, ఫిబ్రవరి 6: కాంగ్రెస్ పార్టీ టిక్కెట్టు కోసం రైల్వేకోడూరు ఇన్‌చార్జ్ గోశాల దేవి మంగళవారం విజయవాడలోని ఆంధ్రా భవన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 2019 ఎన్నికల్లో పార్టీ తనకు టిక్కెట్టు ఇచ్చిందన్నారు. రైల్వేకోడూరు నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో మండల పార్టీ అధ్యక్షులను నియమించి బలోపేతం చేశామని తెలిపారు. కేంద్రంలో రాహుల్, రాష్ట్రంలో వైఎస్ షర్మిలారెడ్డి విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.

ఓటర్ల జాబితాను జాగ్రత్తగా రూపొందించాలి

చిట్వేలి, ఫిబ్రవరి 6 : అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు ఉండే విధంగా జాబితాను క్షుణ్ణంగా పరిశీలించాలని ఎస్‌డీసీ లీలారాణి సూచించారు. మంగళవారం మండల పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలలో ఆమె పర్యటించారు. అనంతరం రెవెన్యూ కార్యాలయంలో తహశీల్దారు సుమనితో కలిసి సిబ్బందికి, సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నేతల మాట

జీడీనెల్లూరు: రామానాయుడు పల్లె వద్ద మంగళవారం జరిగిన రా కదలిరా సభలో చంద్రబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు రాకముందు.. వచ్చాక పలువురు నేతలు ప్రసంగించారు. వీరిలో కొందరి ప్రసంగం వారి మాటల్లోనే..



వీళ్లా జిల్లాను అభివృద్ధి చేసేది

జిల్లాలో ముగ్గురు మంత్రులున్నారు. అందులో ఒకడేమో పుంగనూరులో అక్రమ కేసులు పెడతాడు. మరో మహిళా మంత్రేమో పదవులు ఇప్పిస్తానని సొంత నాయకుల చేత డబ్బులు వసూలు చేస్తుంది. ఇక్కడున్న ఉపముఖ్యమంత్రి పొద్దున ఏమి మాట్లాడతాడో.. సాయంత్రం ఏమి మాట్లాడతాడో తెలియదు. ఇలాంటి వాళ్లా జిల్లాని అభివృద్ధి చేసేది.

- అమరనాథరెడ్డి, మాజీ మంత్రి



జిల్లాను దోచుకుంటున్నారు

జీడీనెల్లూరు ఎమ్మెల్యే నారాయణస్వామి జగన్‌కు బినామీగా దోచిపెడుతున్నాడు. ఎర్రచందనం స్మగ్లర్ విజయానందరెడ్డికి చిత్తూరు అసెంబ్లీ ఇన్‌చార్జి ఇచ్చారు. చంద్రగిరిలో గంజాయి, ఎర్రచందనం, ఎర్రమట్టి, ఆస్తులు దోచుకుంటున్న వ్యక్తి చెవిరెడ్డి. వీరందరికీ ముఠా నాయకుడు పెద్దిరెడ్డి.

- పులివర్తి నాని, చిత్తూరు పార్లమెంటు టీడీపీ అధ్యక్షుడు



కొండల్ని పిండి చేస్తున్నారు

జీడీనెల్లూరు నియోజకవర్గంలో వైసీపీ నాయకులు భూకబ్జాలు, కొండల్నీ పిండిచేసి ఆక్రమించేస్తున్నారు. నారాయణస్వామి ఓ పక్క ఎర్రచందనం దొంగని, మరో పక్క ఇసుక దొంగని పెట్టుకుని నియోజకవర్గాన్ని దోచేశారు. టీడీపీని గెలిపించండి. యువతకి ఉద్యోగం, పరిశ్రమలు తెప్పించే బాధ్యత నేను తీసుకుంటా.

- థామస్, జీడీనెల్లూరు టీడీపీ ఇన్‌చార్జి

ఎస్సీ, బీసీ సబ్‌ప్లాన్ నిధులు పక్కదారి



ముఖ్యమంత్రి జగన్ నిరంతరం నా ఎస్సీలు, నా బీసీలు అని ప్రగల్భాలు పలుకుతుంటారు. మరి, ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులను, బీసీ సబ్సిడీ నిధులను పక్కదారి పట్టించింది నువ్వు కాదా? ఈ సభకు వచ్చిన జనాన్ని చూస్తుంటే జిల్లాలో అన్నీ అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ గెలుపు ఖాయం అనిపిస్తుంది.

- మురళీమోహన్, పూతలపట్టు టీడీపీ ఇన్‌చార్జి



ఎన్ని కేసులు పెట్టినా భయపడం

ఉపముఖ్యమంత్రి నారాయణస్వామి 15 కేసులు పెట్టాడు. మరో 150 పెట్టినా భయపడం. వెదురుకుప్పం, కార్వేటినగరం మండలాలను తిరుపతి జిల్లాలో చేర్చలేని అసమర్థుడు. ఆయన్ను ఓడించి సీబీఐ ఎంక్వయిరీ వేసి లోపలవేస్తాం. ఖబడ్దార్.

- యుగంధర్, జనసేన జీడీనెల్లూరు ఇన్‌చార్జి





చిత్తూరు- పుత్తూరు రహదారిపై కిక్కిరిసిన జనం - సభలో తెలుగు మహిళల ఉత్సాహం - హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుకు వీడ్కోలు



హెలిప్యాడ్ వద్ద చంద్రబాబుతో గురజాల జగన్మోహన్

'పాచిగుంట' మృతి తీరని లోటు

జీడీనెల్లూరు: తెలుగురైతు రాష్ట్ర నేత, గంగాధరనెల్లూరు మండలం పాచిగుంటకు చెందిన పాచిగుంట మనోహర్‌నాయుడి మృతి పార్టీకి తీరని లోటని చంద్రబాబు వ్యాఖ్యానించారు. ఆయన మృతి తనను కలచి వేసిందన్నారు. వారి కుటుంబానికి టీడీపీ అండగా ఉంటుందన్నారు. అనంతరం మనోహర్‌నాయుడు కుమార్తెలు రాధిక, శిల్ప, తమ్ముడు కుమారుడు రఘునాథనాయుడును తన వాహనం వద్దకు పిలిపించుకుని చంద్రబాబు మాట్లాడారు. ధైర్యంగా ఉండాలని వారికి సూచించారు.



మనోహర్ నాయుడి కుటుంబీకులతో చంద్రబాబు

ఎంపీడీవోలకు మండలాల కేటాయింపు

చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఇతర జిల్లాల నుంచి ఉమ్మడి చిత్తూరు జిల్లాకు వచ్చిన వారికి పోస్టింగ్స్ ఇస్తూ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి ఎంపీడీవోల్లో 23మందిని అనంతపురం జిల్లాకు, ముగ్గురిని కడప జిల్లాకు బదిలీ చేశారు. వారి స్థానంలో చిత్తూరు జిల్లాకు 17మందిని నెల్లూరు జిల్లాకు, 15 మందిని కడప జిల్లా నుంచి వెరసి 32 మందిని బదిలీ చేశారు. ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో మండలాల్లో ఖాళీలను బట్టి పోస్టింగ్ ఇచ్చారు. ఎన్నికలు ముగిసి కొత్త ప్రభుత్వం బాధ్యతలు స్వీకరించేవరకు వీరు చిత్తూరు జిల్లాలో విధులు నిర్వహించనున్నారు.

కేటాయించిన మండలాలివీ..

- కడప జిల్లా నుంచి వచ్చిన 13 మందిలో సి.వెంకటేశు (చౌడేపల్లి), జి.రవికుమార్ రెడ్డి (నగరి), కె.వి.శ్రీధర్ నాయుడు (కార్వేటినగరం), టి.వెంగముని రెడ్డి (పుంగనూరు), పి.వరప్రసాద్ (సోమల), జె.సుజాతమ్మ (వడమాలపేట), ఎస్.నూర్జహాన్ (బి.కొత్తకోట), ఎ.జగదీశ్వర్ రెడ్డి (గుర్రంకొండ), జి.రెడ్డయ్య (కేవీపల్లి), సి.రామక్రిష్ణయ్య (కలికిరి), బి.మైథిలి (నిమ్మనపల్లి), సి. వెంకటరమణయ్య (పెద్దమండ్యం), జి.కృష్ణమూర్తి (తంబళ్లపల్లి) మండలాల్లో పోస్టింగులు ఇచ్చారు.
- **నెల్లూరు జిల్లా నుంచి వచ్చిన 17 మందిలో...** ఎస్ గోపి (గుడుపల్లి), ఎం.భవాని (నింద్ర), కె.వెంకటేశ్వరరావు (పెనుమూరు), కె.సురేష్ బాబు (పులిచెర్ల), బి.సింగయ్య (యాదమరి), పి.ప్రసన్నకుమారి (పూతలపట్టు), జి.వెంకటేశ్వర్లు (తవణంపల్లి), కె.గోవర్ధన్ (వి.కోట), ఎం.బ్రహ్మయ్య (విజయపురం), ఎం.భాస్కర్ (గంగాధరనెల్లూరు), కె.షాలెట్ (బి.ఎన్. కండ్రిగ), వి.వి.సూర్యసాయి (చంద్రగిరి), కె.వి.శివప్రసాద్ (కేవీబీ పురం), కె.నాగేంద్రబాబు (పాకాల), కె.ప్రత్యూష (రామచంద్రాపురం), పి. ఐజాక్ ప్రవీణ్ (తొట్టంబేడు), ఎం.మధుసూదనరావు (ఎర్రావారిపాళ్యం) మండలాలను కేటాయిస్తూ పోస్టింగులు ఇచ్చారు.

ఉద్యోగుల వివరాల సేకరణలో యంత్రాంగం




చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో వివిధ శాఖల్లో పనిచేస్తున్న ఉద్యోగుల వివరాల సేకరణలో మూడ్రోజులుగా జిల్లా యంత్రాంగం నిమగ్నమైంది. ఎన్నికల నిర్వహణ కోసం అవసరమైన ఉద్యోగుల పూర్తి డేటాను పంపాలని ఇటీవల ఎన్నికల సంఘం ఆదేశించింది. ఆ మేరకు 34 అంశాలతో కూడిన ప్రొఫార్మాలో ఉన్నత స్థాయి అధికారి నుంచి క్రిందిస్థాయి సిబ్బంది వరకు వివరాలతో కూడిన జాబితాను తయారు చేస్తున్నారు. కలెక్టరేట్‌లోని డీఆర్వో చాంబర్ పక్కన గల ఎన్ఐసీ వీడియోకాన్ఫరెన్స్ హాలులో ఈ ప్రక్రియ కొనసాగుతోంది. ఉద్యోగుల సొంత జిల్లా, నియోజకవర్గం, మండల వివరాలు, సీఎఫ్ఎంఎస్ సంఖ్య, పేస్కేల్, బేసిక్ పే, గతంలో ఎన్నికల విధులకు హాజరైవుంటే ఆ వివరాలను సైతం జిల్లా అధికారుల నుంచి నమోదు చేస్తున్నారు. ఇందుకు సంబంధించి జిల్లా అధికారులు, వారి సహాయకులతో కలిసి డేటా నమోదులో పాల్గొంటున్నారు. ఈ వివరాల సేకరణ పూర్తయ్యాక సీఎఫ్ఎంఎస్ ద్వారా జీతాలు పొందని ఉద్యోగుల వివరాలు కూడా సేకరించనున్నారు. రెండుమూడు రోజుల్లో వివరాల సేకరణ పూర్తయిన తర్వాత నివేదికను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పేరిట ఎన్నికల సంఘానికి నివేదించనున్నారు. ఎన్నికల షెడ్యూల్ అధికారపూర్వకంగా విడుదలయిన తర్వాత ఎన్నికల విధుల కోసం అవసరమైన ఉద్యోగుల జాబితాను సిద్ధం చేస్తారు. విధుల్లో తీసుకున్న ఉద్యోగుల్లో 20శాతం మందిని ఎన్నికల విధులకోసం రిజర్వులో ఉంచుతారు.

ముండ్రివారిపల్లె సమీపంలో జంట ఏనుగులు

సోమల, ఫిబ్రవరి 6: సోమల మండలంలో సంచరిస్తున్న జంట ఏనుగులు మంగళవారం ముండ్రివారిపల్లె సమీప వరిపొలాల్లో తొక్కుకుంటూ వెళ్లాయి. మల్లికార్జున, నెల్లిమంద బాషా పొలాల్లో పంటలను ధ్వంసం చేశాయి. వారం రోజులుగా మండల రైతులను జంట ఏనుగులు కునుకు లేకుండా చేస్తున్నాయి. సోమవారం రాత్రి గంగమ్మ గుడి వద్ద మామిడి తోటలో తిరగాడి డ్రిప్ పరికరాలను తొక్కి వేశాయి. అటవీ అధికారులు జంట ఏనుగులను అటవీ ప్రాంతానికి తరలించడానికి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఖర్చుకు సిద్ధమా...?

'అహ నా పెళ్లంట సినిమాలో బ్రహ్మానందంలా ఉంది మా పరిస్థితి' అంటూ వాపోతున్నారు నగరి నియోజకవర్గంలోని వైసీపీ నాయకులు. సీఎం జగన్ అనంతపురంలో నిర్వహించనున్న సిద్ధం సభకు తరలించాల్సిన జనసంఖ్య నియోజకవర్గాలవారీగా ఖరారైంది. 5నుంచి 10వేల మందిని నగరి నుంచి తరలించాలని నిర్ణయించారు. ఇందులో భాగంగా మంగళవారం నగరిలో వైసీపీ నాయకులతో మంత్రి రోజా నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహించారు. ఒక్కో స్థానిక నాయకుడు, స్థానిక సంస్థల ప్రజాప్రతినిధి కనీసం 50 మందిని అనంతపురం సభకు తరలించాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. సభకు వెళ్లేందుకు బస్సు సౌకర్యం మాత్రం పార్టీ ఏర్పాటు చేస్తుందని, సభకు వచ్చే వారికి అయ్యే ఖర్చులు ఆయా నాయకులే భరించుకోవాలని తేల్చి చెప్పేశారు.ఈ మాట వినగానే నాయకులు ఒకరి ముఖాలు మరొకరు చూసుకున్నారు. 'అధికారంలోకి వచ్చి ఐదేళ్లు పూర్తవుతోంది. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు పెట్టిన ఖర్చులకు కనీసం వడ్డీకి సరిపడా కూడా సంపాదించుకోలేకపోయా' అని ఒక నాయకుడు వాపోయాడు. 'సరేలే భలే చెప్పావులే అన్నా.... కౌన్సిలర్ ఎలక్షన్లలో రూ.20 లక్షలు ఖర్చయింది. కనీసం వార్డులో డ్రైనేజీ నిర్మించే పని కూడా చేసుకోలేకపోయాను' అంటూ మరో కౌన్సిలర్ కం నాయకుడు నిట్టూర్చాడు. 'ఎక్కడో అనంతపురానికి అధినేత వస్తే మనం ఖర్చులు భరించి, జనాన్ని తీసుకువెళ్లడం ఏమిటి? పెద్ద నాయకుల పుట్టినరోజులు వస్తే వార్డుల్లో, గ్రామాల్లో వేలకు వేలు ఖర్చులు పెట్టి ఫ్లెక్సీలు కట్టాలి... నియోజకవర్గంలో మీటింగ్ అంటే జనాన్ని తోలాలి... పల్లెనిద్ర, గడప గడపకు అంటే రూ.లక్షలు ఖర్చు. ఎందుకు జగనే కావాలి అనే కార్యక్రమానికైతే చేతి చమురు వదిలింది. వడ్డీలు కట్టుకోవడం తప్ప రూపాయి సంపాదన లేదు.' అని చేతి చిల్లు వదిలిన మరొకరు భోరుమన్నారు. మంత్రి ముందు నోరెత్తకపోయినా ఒకరికొకరు మాత్రం తమ కష్టాలు కడుపుచించుకుని పంచుకున్నారు.



-పుత్తూరు అర్బన్

14న ఉద్యమానికి సిద్ధం



సంఘీభావం ప్రకటిస్తున్న ఎన్జీవో నాయకులు

చిత్తూరు (సెంట్రల్), ఫిబ్రవరి 6 : ప్రభుత్వ ఉద్యోగులకు రావాల్సిన డీఏ, పీఆర్సీ, పెండింగ్ బకాయిలు చెల్లించకుంటే ఈనెల 14న ఉద్యమానికి సిద్ధం కావాలని ఎన్జీవో జిల్లా అధ్యక్షుడు రాఘవులు తెలిపారు. మంగళవారం పశుసంవర్థక శాఖ కార్యాలయంలో ఉద్యోగులు చేపట్టిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. డీఏ, పీఆర్సీ, బకాయిలు చెల్లించకపోగా సరెండర్ లీవుల మొత్తాన్ని కూడా మూడేళ్లుగా సమర్పించలేదన్నారు. నూతన పీఆర్సీ కమిటీని ఎవ్వరూ నమ్మడం లేదన్నారు. నిర్దేశిత గడువు పూర్తయిన నేపథ్యంలో 30 శాతం ఐఆర్ మంజూరు చేయాలన్నారు. లేని పక్షంలో ఏపీఎన్జీవో, ఏపీ జేఏసీల రాష్ట్ర స్థాయి కమిటీ ఆదేశాల మేరకు ఈ నెల 14 నుంచి ఉద్యమానికి సిద్ధం కావాలన్నారు. అభివాదంలో ఏపీ ఎన్జీవో కార్యదర్శి రఘు, ఎన్‌పీ ప్రసాద్, నరసింహారెడ్డి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

క్రైస్తవులుగా నమోదు చేయమంటే దౌర్జన్యం


చిత్తూరు, ఫిబ్రవరి 6: రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న కులగణన సర్వేలో క్రైస్తవులుగా నమోదు చేయమంటే దౌర్జన్యం చేశారని చౌడేపల్లె మండలం పక్షిరాజపురం గ్రామానికి చెందిన క్రైస్తవులు ఆవేదన వ్యక్తం చేశారు. దౌర్జన్యం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేయడానికి పలువురు మంగళవారం కలెక్టరేట్‌కు వచ్చారు. తాము ఎస్టీ నక్కల కులానికి చెందిన వారమని, 30ఏళ్ల క్రితమే తమ పూర్వీకులు క్రైస్తవ మతాన్ని స్వీకరించారని తెలిపారు. వలంటీర్ కులగణన సర్వేకు వచ్చిన సమయంలో తమను క్రైస్తవులుగా నమోదు చేయమని కోరగా, అంగీకరించలేదన్నారు. మేం చెప్పినట్లు వినకుంటే ఆధార్, రేషన్‌కార్డులను రద్దు చేస్తామని బెదిరింపులకు దిగడమే కాకుండా దౌర్జన్యం చేశారని ఆరోపించారు. న్యాయం కోసం కలెక్టరేట్‌కు వచ్చామన్నారు. వీరికి పాస్టర్ల సంఘం రాయలసీమ వైస్ ప్రెసిడెంట్ రెవరెండ్ రాబర్ట్ మద్దతు పలికారు. అనంతరం కలెక్టరేట్‌లోని అధికారులకు వినతిపత్రం అందచేశారు.



కలెక్టరేట్‌కు వచ్చిన పక్షిరాజపురం ఎస్టీలు

వెంకన్న హుండీకి మరో టోకరా

తిరుపతి టౌన్ బ్యాంకులో రూ.10కోట్లు డిపాజిట్ చేసిన టీటీడీ



శ్రీవారి నిధులను ఇష్టారాజ్యంగా వాడేస్తున్నారన్న విమర్శల నేపథ్యంలో డిపాజిట్ల రూపంలో మరో వ్యవహారం వెలుగులోకి వచ్చింది. తిరుపతి కోఆపరేటివ్ టౌన్ బ్యాంకులో రూ.10 కోట్లను గుట్టుచప్పుడుకాకుండా టీటీడీ డిపాజిట్ చేసింది.రెండు రోజుల క్రితం టీటీడీ ఖజానా నుంచి 13నెలలకు తిరుపతి టౌన్ బ్యాంకుకు నిధులు డిపాజిట్ చేసినట్టు విశ్వసనీయంగా తెలుస్తోంది. దీనికి సంబంధించిన డిపాజిట్ బాండ్లను కూడా టీటీడీకి టౌన్‌బ్యాంకు అందజేసినట్టు సమాచారం. టీటీడీ నియమ నిబంధనల మేరకు మిగులు మొత్తాలను ఎక్కువ వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకులో మాత్రమే డిపాజిట్ చేయాల్సి ఉంటుంది. ప్రభుత్వం ఆమోదించిన ప్రైవేట్ రంగ బ్యాంకులు కొటేషన్లు సమర్పించే అర్హత పొందడానికి అత్యధిక క్రెడిట్ రేటింగ్ కలిగివుండాలి. కేంద్ర ప్రభుత్వ లేదా రాష్ట్ర ప్రభుత్వ సెక్యూరిటీలలో పెట్టుబడి పెట్టకూడదని టీటీడీ పాలకమండలి ఇదివరకే తీర్మానించింది. 2022లో టీటీడీ విడుదలచేసిన శ్వేతపత్రం మేరకు దాదాపు రూ.1600 కోట్లు నగదు రూపంలో వివిధ జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ల రూపంలో వున్నాయి. డిపాజిట్ చేయదలుచుకున్న జాతీయ బ్యాంకు ఎంత వడ్డీ ఇస్తుందో తెలియజేస్తూ సీల్డుకవర్‌లో కొటేషన్ పంపాలి. టీటీడీ ట్రస్టు అనుమతితో అధిక వడ్డీ ఇచ్చే జాతీయ బ్యాంకుల్లో డిపాజిట్ చేస్తుంటారు. టీటీడీ ఇప్పటివరకు ఎస్బీఐ, ఇండియన్ ఓవర్సీస్ బ్యాంకు, విజయ బ్యాంకు, ఆంధ్రా బ్యాంకు, ఇండియన్ బ్యాంకు, బ్యాంక్ ఆఫ్ బరోడా వంటి బ్యాంకుల్లో డిపాజిట్ చేసినట్టు తెలిసింది. అయితే పాలకమండలి ముఖ్యనేత నోటిమాట చెప్పారని రూ.10కోట్లు ఒక్క క్లిక్‌తో టౌన్‌బ్యాంకులో డిపాజిట్ చేసేశారు. రూ50 కోట్లు అడిగితే తొలివిడతగా 8.5 శాతం వడ్డీ రేటుతో రూ.10కోట్లు జమచేశారు. ఇప్పటివరకు సహకార బ్యాంకుల్లో శ్రీవారి నిధులు డిపాజిట్ చేసిన దాఖలాల్లేవు. ఎన్నికలవేళ నగరంలో మహిళలకు భారీగా రుణాలు ఇచ్చేందుకే ఈ నిధులు వినియోగిస్తారని ప్రచారం జరుగుతోంది. ఎన్నికల ఏడాది కాబట్టి రుణగ్రహీతలు తిరిగి చెల్లించకపోతే టౌన్‌బ్యాంకుపై భారం పడకతప్పదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత టౌన్‌బ్యాంకు భవితవ్యంపై నీలినీడలు కమ్ముకున్నాయి. కొత్త పాలకమండలి వచ్చిన తర్వాత దాదాపు రూ.15కోట్లు డిపాజిట్‌దారులు వెనక్కి తీసుకున్నట్టు సమాచారం.

- తిరుపతి,ఆంధ్రజ్యోతి

అవకాశమిస్తే పలమనేరు నుంచి పోటీ చేస్తా

- జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు



చిత్తూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 6: పలమనేరు అసెంబ్లీ అభ్యర్థిగా తనకు అధిష్ఠానం అవకాశం ఇస్తే పోటీచేస్తానని జడ్పీ చైర్మన్ శ్రీనివాసులు మంగళవారం తెలిపారు. ప్రస్తుతం ఎమ్మెల్యేగా వున్న వెంకటేగౌడను మార్చాలని, ఆయన స్థానంలో పోటీ చేయాలని అధిష్ఠానం నిర్ణయిస్తే కట్టుబడి ఉంటానన్నారు. తన అభ్యర్థిత్వానికి పలమనేరు మున్సిపల్ చైర్‌పర్సన్ చాముండేశ్వరి సుధ, మార్కెట్ కమిటీ చైర్మన్ హేమంత్ రెడ్డి, పెద్దపంజాణి, బైరెడ్డిపల్లి, పలమనేరు, గంగవరం ఎంపీపీలు రెడ్డెప్ప, రెడ్డెప్ప, శ్రీదేవి, మురళీమోహన్ రెడ్డి తదితరులు మద్దతు ఇస్తున్నారన్నారు. పలమనేరు స్థానానికి పోటీచేసే విషయమై అంతకుముందు ఆయన తన చాంబరులో అనుచరులతో మంతనాలు చేశారు.

ఆర్టీసీ బస్సు బోల్తా : 27 మందికి గాయాలు



బోల్తా పడ్డ బస్సు - గాయపడ్డ వారిని అంబులెన్స్‌లోకి ఎక్కిస్తున్న పోలీసులు

తిరుపతి రూరల్, ఫిబ్రవరి 6: ఆర్టీసీ బస్సు బోల్తా పడటంతో 27 మంది ప్రయాణికులు గాయపడ్డారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. చిత్తూరు డిపోకు చెందిన బస్సు తిరువణ్ణామలై నుంచి తిరుమలకు వెళుతోంది. సోమవారం అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో తిరుపతి రూరల్ మండలంలోని వేదాంతపురం సర్కిల్ - రామానుజపల్లె సర్కిల్‌కు మధ్య జాతీయ రహదారిపై వెళుతుండగా ఎదురుగా టిప్పర్ వచ్చింది. దీంతో వాహనాన్ని బస్సు డ్రైవర్ అదుపు చేయబోతుండగా రోడ్డుపక్కకు బోల్తా పడింది. బస్సులో 42మంది ప్రయాణికులు ఉండగా, 27మందికి గాయాలయ్యాయి. బాధితులను 108 అంబులెన్స్‌లో రుయాస్పత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ఇద్దరిని మాత్రం స్విమ్స్‌కు తీసుకెళ్లారు. బాధితుల్లో ఒకే కుటుంబానికి చెందిన ఐదుగురు (భార్యభర్తలు, ముగ్గురు చిన్నారులు)ఉన్నారు. స్వల్ప గాయాలైన వారంతా మంగళవారమే డిశ్చార్జ్ కాగా, ఐదుగురు మాత్రమే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఇరు వాహనాల డ్రైవర్లపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్టు తిరుపతి రూరల్ ఎస్ఐ నాగేంద్రబాబు తెలిపారు.

పాఠకులకు ముఖ్యగమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధం లేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా/ఇతరత్రా నమ్మించబడిన /క్లెయిమ్స్‌కు, బట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు. పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.

మేనేజర్ - ఏడివిటి

హంద్రీ-నీవా జలాల లీకేజీని అరికట్టండి

● తీవ్ర ఇబ్బందులు పడుతున్నామంటూ రాస్తారోకో చేపట్టిన ప్రజలు ● ఆందోళనకు మద్దతు తెలిపిన మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి


హంద్రీ-నీవా జలాల లీకేజీపై జాతీయరహదారిపై నిరసన తెలుపుతున్న ప్రజలు


ఆందోళనకారులకు మద్దతు తెలుపుతున్న దొమ్మలపాటి రమేశ్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6: హంద్రీ-నీవా జలాల లీకేజీని అరికట్టి పట్టణ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులేకుండా చర్యలు తీసుకోవాలని బాధిత ప్రజలు డిమాండ్ చేశారు. మదనపల్లె పట్టణం పుంగనూరు రోడ్డు బసినికొండ ప్రాంతంలో ఒక వీధిలోకి ఎగువన వున్న హంద్రీనీవా జలాలు లీకేజి కావడంతో ఇబ్బందులు పడుతున్నామంటూ ప్రజలు మంగళవారం రాస్తోరోకో చేపట్టారు.
ఈ సందర్భంగా ఆందోళనకారులు మాట్లాడుతూ లీకేజీ నీటి వల్ల రోడ్డంతా బురదమయంగా మారిపోయి ఇళ్లలోకి వెళ్లేందుకు వీలులేకుండా ఉంటోందన్నారు. అలాగే ఆటో, కార్ల మరమ్మతుల షెడ్లలో నీరు చేరి విద్యుత్‌షాక్ తగులుతోందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదంటూ వాపోయారు. మదనపల్లె పట్టణానికి దక్షిణం వైపున హంద్రీ-నీవా కాలువ వెళుతోంది. కుప్పంకు హంద్రీ-నీవా జలాలను చేర్చాలని వైసీపీ ప్రభుత్వం నీటిని పంపింగ్ ద్వారా పంపు తోంది. ఈ క్రమంలో పట్టణానికి ఎగువన హంద్రీ-నీవా కాలువ లీకేజీ తో నీరంతా బసినికొండ కింద ఉన్న మెకానిక్ షెడ్లు, ఇళ్ల ముందర ప్రవహిస్తోంది. దీంతో ప్రజలు బురదలో నడవలేక ఇబ్బందులు పడుతు న్నారు. అంతే కాక ఎర్త్ కావడంతో మెకానిక్ షెడ్లలో, వెల్డింగ్ షాపుల్లో కార్మికులు విద్యుత్‌షాక్‌కు గురవుతున్నారు. దీంతో ప్రజలు పుంగనూరు రోడ్డుపై రాస్తారోకో నిర్వహించారు. విషయం తెలుసుకున్న మదనపల్లె టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేశ్ అక్కడికి చేరుకుని ప్రజలకు మద్దతు తెలిపి ఆందోళనలో పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన హంద్రీ-నీవా అధికారులకు అక్కడి నుంచే ఫోన్ చేసి సమస్యను పరిష్కరించాలని కోరారు.

ముమ్మరంగా ఎస్ఈబీ దాడులు



మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6: మదనపల్లె ఎస్ఈబీ సర్కిల్ పరిధిలో సోమవారం రాత్రి నిర్వహించిన విస్తృత దాడుల్లో ఎస్ఈబీ పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. ఎస్ఈబీ సీఐ రమేశ్‌రెడ్డి కథనం మేరకు...రామసముద్రం మండలం ఆర్లేపల్లె చెక్‌పోస్టు వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా మదనపల్లె మండలం దేవళంపల్లెకు చెందిన ఎం. వెంకటరమణ, మండ్యం వెంకటరమణ ద్విచక్రవాహనంలో ఐదు బాక్సుల కర్ణాటక మద్యం తరలిస్తూ పట్టుబడ్డారన్నారు. వారిద్దరు కలసి దేవళంపల్లెకు చెందిన సుంకర గోపాలకృష్ణకు కర్ణాటక మద్యం సరఫరా చేస్తున్నట్లు విచారణలో తెలిసిందన్నారు. దీంతో నిందితులు ఇద్దరిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనం సీజ్ చేశామన్నారు. గోపాలకృష్ణపై కేసు నమోదు చేశామన్నారు. అలాగే చీకిలబైలు చెక్‌పోస్టు వద్ద రాయచోటి డీటీఎఫ్ ఎస్ఐ ఈశ్వరనాయుడు, మదనపల్లె ఎస్ఈబీ పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో రాయనిచెరువు వడ్డిపల్లెకు చెందిన రవీంద్ర వద్ద ఏడు కర్ణాటక మద్యం బాటిళ్లు బయటపడటంతో అతడిని అరెస్టు చేసి, ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నామన్నారు. దీంతో పాటు మదనపల్లె డీటీఎఫ్ ఎస్ఐ హేమకుమార్ ఆధ్వర్యంలో మండలంలోని ములకలదిన్నె గ్రామంలో దాడులు చేయగా నాటుసారా విక్రయిస్తున్న రెడ్డెప్ప వద్ద 45 లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకున్నారన్నారు. నిందితులు నలుగురిని రిమాండ్ నిమిత్తం కోర్టుకు తరలించామన్నారు. మరో నిందితుడు గోపాలకృష్ణను త్వరలో అరెస్టు చేస్తామని సీఐ రమేశ్‌రెడ్డి చెప్పారు.

సరైన బిల్లులు లేని కంటైనర్ సీజ్

రామసముద్రం, ఫిబ్రవరి 6: సరైన బిల్లులు లేకుండా గుజరాత్ నుంచి కర్ణాటక మీదుగా ఆంధ్రాకు ఆరువేల పైగా గోడ గడియారాలు తరలిస్తున్న కంటైనర్‌ను అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించి కంటైనర్‌ను సీజ్ చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ తెలిపారు. కర్ణాటక బార్డర్ చెక్‌పోస్టు వద్ద సోమవారం రాత్రి ఈ కంటైనర్‌ను సీజ్ చేసినట్లు తెలిపారు. ఇందులో పుంగనూరుకు చెందిన ఓ నాయకుడి పేరుతో ముద్రించిన 312 బాక్సులలో ఒక్కొక్క బాక్స్‌లో 12 గడియారాల చొప్పున 6864 గడియారాలు ఉన్నట్లు ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

సారా కేసులో మహిళ అరెస్టు

కలకడ, ఫిబ్రవరి 6:మండలంలోని బాలయ్యగారిపల్లె పంచాయతీ ఎస్టీ కాలనీలో అక్రమంగా సారా విక్రయిస్తున్న రాణి అనే మహిళను అరెస్టు చేసినట్లు ఎస్ఐ రామకృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో ఆమె విక్రయిస్తున్న 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

10లీటర్ల సారా స్వాధీనం.. వ్యక్తి అరెస్ట్

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 6: గుట్టుచప్పుడు కాకుండా నాటుసారాను విక్రయిస్తున్న ఒకరి పట్టుకొని అతని వద్ద నుంచి 10లీటర్ల స్వాధీనం చేసుకొని అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ లోకేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలోని అగ్రహారం పంచాయతి చింతపర్తివారిపల్లికి చెందిన రాయచోటి వెంకటరమణ(58) నాటుసారా విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడులు నిర్వహించి అతని నుంచి 10లీటర్ల నాటుసారా స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి రిమాండుకు తలించినట్లు తెలిపారు.
పెద్దమండ్యంలో: పెద్దమండ్యం మండలం బండమీదపల్లి గ్రామ పంచాయతీ తురకపల్లి కు చెందిన జాఫర్ (35)అనే వ్యక్తి 8 లీటర్లు నాటు సారా రవాణాకు సిద్ధం చేస్తుండగా అరెస్టు చేసినట్లు ఎస్ఐ వెంకటేష్ వెల్లడించారు. సోమవారం రాత్రి సమాచారం అందుకున్న పోలీసులు 8 లీటర్ల నాటుసార స్వాధీనం చేసుకొని జాఫర్‌ను అరెస్టు చేసికేసు నమోదు చేసి మంగళవారం కోర్టులో హాజరుపరచగా రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు వెల్లడించారు.

సచివాలయ ఉద్యోగికి తీవ్ర గాయాలు


గాయపడ్డ మోహన్‌బాబు

కలకడ, ఫిబ్రవరి 6: మండలంలోని బాటవారిపల్లి హంద్రీ-నీవా కాలువ వద్ద మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో సచివాలయ ఉద్యోగి మోహన్‌బాబుకు తీవ్ర గాయాలయ్యాయి. కె.దొడ్డిపల్లి సచివాలయంలో వెటర్న రీ అసిస్టెంట్ గా పనిచేసే మోహన్‌బాబు పని ముగించుకుని ద్విచక్ర వాహనంలో ఇంటికి వెళుతుండగా లారీ ఢీకొంది. తల, శరీరం పై గాయాలు కావడంతో బాధితుడిని చికిత్స నిమిత్తం ఈఎంటీ యోగనందరెడ్డి, పైలట్ శ్రీనివాసులు 108లో పీలేరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పోలీసులు చేరుకుని దర్యాప్తు చేస్తున్నారు.

యువకుడి ఆత్మహత్యాయత్నం

కురబలకోట, ఫిబ్రవరి 6: ప్రియురాలు మోసం చేసిందని ఓ యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ సంఘటన మంగళవారం మండలంలో జరిగింది. దీనికి సంబంధించి పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మండలంలోని అంగళ్లకు చెందిన సాయికిశోర్(26) ఓయువతిని ప్రేమించాడు. కాగా ఆ యువతికి మరొకరితో వివాహం కావడంతో మనస్తాపం చెంది సూపర్‌వ్యాస్‌మాల్ తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబీకులు అతడిని మదనపల్లె ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ మేరకు ముదివేడు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ



ములకలచెరువు, ఫిబ్రవరి 6: ముంబాయి - చెన్నై జాతీయ రహదారిలో మంగళవారం ఎస్ఐ తిప్పేస్వామి ఆధ్వర్యంలో ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ వాహనాల్లో అనుమతి లేని, నిషేధిత వస్తువులు తరలిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మైనర్లకు ద్విచక్ర వాహనాలు ఇవ్వరాదన్నారు. సిబ్బంది నాగిన్, హరి పాల్గొన్నారు.

మర్రిమాకులపల్లె మాజీ సర్పంచ్ మృతి


వెంకట్రమణారెడ్డి (ఫైల్ ఫోటో)

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 6: తంబళ్లపల్లె మండలం మర్రిమాకులపల్లె మాజీ సర్పంచ్ కేతిరెడ్డి వెంకట్రమణారెడ్డి(81) మంగళవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన గతంలో మూడు సార్లు మర్రిమాకులపల్లె సర్పంచ్‌గా ఎన్నికై గ్రామాభివృద్ధికి విశేషంగా కృషిచేశారు. పలువురు ప్రజాప్రతినిదులు, సర్పంచ్‌లు ఆయన మృతదేహన్ని సందర్శించి నివాళులు అర్పిం చారు. బుధవారం ఉదయం మర్రిమాకులపల్లెలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబసభ్యులు తెలిపారు.

పారిశుధ్యంపై అవగాహన పెంచాలి

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6: గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రజలకు అవగాహన కల్పించాలని డీపీవో ధనలక్ష్మి సూచించారు. మంగళవారం మదనపల్లె మండలంలోని పెంచుపాడు, మాలేపాడు పంచాయతీలో పర్యటించిన డీపీవో అక్కడ సాలిడ్‌వేస్ట్ మేనేజ్‌మెంట్ యూనిట్లను పరిశీలించారు. ప్రజల ఇళ్ల నుంచి తడి చెత్త, పొడిచెత్తను వేర్వేరుగా సేకరించి తరలించాలన్నారు. అక్కడ చెత్త నుంచి ఎరువుల తయారీ కోసం చేపట్టాల్సిన పనులను వివరించారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీ వెంకటసుబ్బయ్య, పంచాయతీ కార్యదర్శి మనోహర్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

గెలుపోటములు నిర్ణయించేది బీఎస్పీనే..


మాట్లాడుతున్న బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గౌతమ్‌కుమార్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి: రాబోవు సార్వత్రిక ఎన్నికల్లో మదనపల్లె నియోజకవర్గంలో గెలుపోటములు నిర్ణయించేది బహుజనసమాజ్ పార్టీయే అని బీఎస్పీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బందెలగౌతమ్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక బీఎస్పీ కార్యాలయంలో మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ నెల 3న మదనపల్లెలో నిర్వహించిన బహుజన రాజ్యాధికార సదస్సును ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించి సదస్సును విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు తెలిపారు. రాబోవు ఎన్నికలకు బహుజన శ్రేణులు సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు రమణ, బాలాజీ, శ్రీను, గంగాధర్, మహేష్, శివ, అరుణ్, అనిల్, ప్రసాద్‌రెడ్డి, మోహన, అశోక్, గంగారాజు, సూరి, తదితరులు పాల్గొన్నారు.

ఉచితవైద్య శిబిరానికి విశేష స్పందన

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 6: మదనపల్లె టూడిపోలో మంగళవారం నిర్వహించిన ఉచితవైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. అమ్మ సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి డాక్టర్లు ఈ. అంకితరెడ్డి, ఎంసీ సందీప్ సౌజన్యంతో ఆర్టీసీ బస్టాండ్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో ఉచితవైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో 60మందికిపైగా బీపీ, షుగర్, ఈసీజీ, హెబీఏ1సీ పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో మోటర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ శివలింగయ్య టూడిపో మేనేజరు నిరంజన్, ఆర్టీసీ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ చైర్‌పర్సన్‌గా షమీమ్ అస్లాం


షమీమ్ అస్లాంను సన్మానిస్తున్న మున్సిపల్ వైస్ చెర్మన్లు, కౌన్సిలర్లు,

మదనపల్లె, ఫిబ్రవరి 6: ఆంధ్రప్రదేశ్ మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎండీసీ) చైర్‌పర్సన్‌గా గుండ్లూరి షమీమ్ అస్లాం రెండోసారి నియమితులయ్యారు. ఈ సందర్భంగా షమీమ్ అస్లాంను మదనపల్లె మున్సిపల్ వైస్ చెర్మన్లు, కౌన్సిలర్లు ఘనంగా సన్మానించారు. మంగళవారం మున్సిపల్ వైస్ చైర్మన్లు జింకావెంకటాచలపతి, బీపీ నూర్ అజాం, కౌన్సిలర్లు మేస్త్రీ శ్రీనివాసులు, బీపీ ఖాజా హుస్సేన్, ఈశ్వర్‌నాయక్, పి.రాజేష్, బాలగంగాధర్‌రెడ్డి మాజీ మున్సిపల్ వైస్‌చైర్మన్ ఇర్ఫాన్‌ఖాన్, తదితరులు మదనపల్లెలో షమీమ్ అస్లాం స్వగృహానికి వెళ్లి శుభాకాంక్షలు తెలిపి ఘనంగా సన్మానించారు.

టీడీపీ సీనియర్ నేత మృతి పార్టీకి తీరని లోటు

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 6: టీడీపీ సీనియర్ నేత పునుగుపల్లి వెంకటరమణ మరణం పార్టీకి తీరని లోటని టీడీపీ ఇన్ చార్జి, మాజీ ఎమ్మెల్యే దొమ్మలపాటి రమేష్ పేర్కొన్నారు. మంగళవారం టీడీపీ మాజీ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు తండ్రి పునుగుపల్లి వెంకటమణ అకాల మరణం చెందారు. విషయం తెలిసిన దొమ్మలపాటి రమేష్ ఆయన స్వగ్రామమైన గౌనిగారిపల్లి చేరుకొని మృత దేహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి టీడీపీ పార్టీ అన్ని విధాల అండగా ఉంటుదని తెలిపారు. పార్టీ నాయకులు లక్ష్మన్న, విజయ్, వెంకటరమణ, మురళి వున్నారు.

ఉపాధి హామీ పనుల పరిశీలన

పెద్దతిప్పసముద్రం ఫిబ్రవరి 6 : మండలంలోని మడుమూరు గ్రామంలో జరుగు తున్న ఉపాధిహామీ పనులను మంగళవారం ఎంపీడీవో గిరధర్‌రెడ్డి పరిశీలించారు. ఉపాధిహామీ కూలీలు ఉపాధిపనులను తమ స్వంత పొలాల్లో మొక్కలు నాటుకోవడం, కందకాలు తవ్వుకోవడం, పొలాల్లో వేసిన బోరు బావుల దగ్గర ఇంకుడు గుంతలు కొట్టుకోడం లాంటి పనులను సైతం చేపట్టవచ్చన్నారు. అనంతరం అదే గ్రామంలోని శ్రీనివాసరాయునిపల్లెలో జరుగుతున్న ఉపాధిహామీ పనులను తనిఖీ చేసి కూలీలకు అవగాహన కల్పించారు. ఉపాధి సిబ్బంది, టెక్నికల్, ఫీల్డ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

డీవార్మింగ్ డేను విజయవంతం చేయాలి

కలకడ, ఫిబ్రవరి 6:జాతీయ డీవార్మింగ్ డేలో భాగంగా ఈ నెల 9వ తేదీ జరిగే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎర్రకోటపల్లె డాక్టర్ జవహర్‌బాబు సిబ్బందికి సూచించారు. ఆశా డే సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ వచ్చే నెల 3,4,5 తేదీల్లో జరిగే పల్స్‌పోలియో కార్యక్రమాన్ని పూర్తి చేయాలన్నారు. అలాగే ప్రభుత్వ ఆసుపత్రిలో కాన్పులు జరిగేలా ప్రోత్సహించాలని కోరారు. కార్యక్రమంలో సిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.

చంద్రబాబును కలిసిన కొండా నరేంద్ర


చంద్రబాబుతో కొండా నరేంద్ర

బి.కొత్తకోట, ఫిబ్రవరి 6: టీడీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్ర బాబునాయుడును తంబళ్లపల్లె నియోజకవర్గం బి.కొత్తకోటకు చెందిన ప్రముఖ పారిశ్రామిక వేత్త కొండా నరేంద్ర కలిశారు. రా..కదలిరా కార్యక్రమంలో భాగంగా చిత్తూరు జిల్లాలోని గంగాధర నెల్లూరుకు విచ్చేసిన చంద్రబాబునాయుడును హెలిపాడ్ వద్ద నరేంద్ర పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తంబళ్లపల్లె నియోజక వర్గ రాజకీయ పరిస్థితులపై ఆయనకు వివరించినట్లు తెలిపారు. త్వరలో తంబళ్లపల్లెలో పర్యటించాల్సిందిగా తను చంద్రబాబును అభ్యర్థించినట్లు పేర్కొన్నారు. కాగా ఇటీవల బి.కొత్తకోటలో టీడీపీ, జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం నిర్వహించిన కొండా నరేంద్ర టీడీపీ అధినేతను కలవడంతో రాజకీయ ప్రాధాన్యం సంతరించుకుంది.

సంకల్పం ఉంటే ఏదైనా సాధించవచ్చు


విద్యార్థులకు టెన్త్ మెటీరియల్ పంపిణీ చేస్తున్న ఫౌండేషన్ సిబ్బంది

నిమ్మనపల్లి, ఫిబ్రవరి 6: సంకల్పం గట్టిగా ఉంటే ఏదైనా సాధించవచ్చని వే ఫౌండేషన్ సంఘమిత్ర రీచ్ గ్లోబుల్ సౌండేషన్ సభ్యుడు డాక్టర్ పైడి అంకయ్య పేర్కొన్నారు. మంగళవారం ముస్టూరులోని కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థినులకు మార్గదర్శి టెన్త్ గైడెన్స్ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు తిరుపతి, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలు, కలాశాలలు, కస్తూరిబా పాఠశాలలు, సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న విద్యార్థులకు దాదాపు 11930 మందికి మెటీరియల్స్‌ను పంపిణీ చేశామన్నారు. ఇచ్చిన పుస్తకాలు చదివితే దిశా నిర్దేశం కలుగుతుందని తద్వారా ఉన్నత స్థాయికి చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో పిన్సిపాల్ మునివెంకటమ్మ, ఉపాధ్యాయులు పాల్గిన్నారు.

సాంకేతికతపై అవగాహన పెంచుకోవాలి


బెంగళూరులోని సవియంట్ టెక్నాలజీస్‌ను సందర్శిస్తున్న మిట్స్ విద్యార్థులు

కురబలకోట, ఫిబ్రవరి 6: విద్యార్థులు టెక్నాలజీపై అవగాహన పెంపొందించుకోవాలని ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పిలుపునిచ్చారు. మండలంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన సీఎస్‌టీ రెండవ సంవత్సరం విద్యార్థులు బెంగళూరులోని సవియంట్ టెక్నాలజీస్‌ను మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా వారికి టెక్నాలజీపై అవగాహన కల్పించడంతో పాటుగా పోటీ ప్రపంచంలో టెక్నాలజీ ప్రాముఖ్యతను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు కిరణ్‌కుమార్, విద్యాశ్రీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి


విద్యార్థులతో మాట్లాడుతున్న డీడీ జాకీర్‌హుస్సేన్

కలకడ, ఫిబ్రవరి 6:త్వరలో జరిగే టెన్త్ పరీక్షలో కష్టపడి చదివి వందశాతం ఉత్తీర్ణత సాధించాలని సాంఘీక సంక్షేమశాఖ డీడీ జాకీర్‌హుస్సేన్ విద్యార్థులకు సూచించారు. సోమవారం రాత్రి ఆయన నడిమిచెర్లలోని ఎస్సీ హాస్టల్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులకు అందుతున్న వసతులు, మెనూ గురించి ఆరాతీశారు. అలాగే వంట గది, పరిసరాలను పరిశీలించారు. విద్యార్థుల ఆరోగ్య విషయంలో జాగ్రత్త వహించి వంటకాలకు తాజా కూరగాయలను వాడాలని వార్డెన్‌కు సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ రమేష్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

కొత్త వ్యక్తుల కదలికలపై సమాచారమివ్వండి


ప్రజలతో మాట్లాడుతున్న ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి

గుర్రంకొండ, ఫిబ్రవరి 6:గ్రామాల్లో కొత్త వ్యక్తుల కదలికలపై ప్రజలు ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి అన్నారు. మండలంలోని నడిమిఖండ్రిగలో మంగళవారం ప్రజలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు ఎన్నికల వేళ గొడవలకు దూరంగా ఉండాలని తెలిపారు. అలాగే సారా అమ్మకాలు, ఇతర అసాంఘీక కార్యక్రమాలపై నిఘా ఉంచామన్నారు. కార్యక్రమంలో సిబ్బంది, ప్రజలు పాల్గొన్నారు.

అధికార పార్టీ అండతోనే పేట్రేగిపోతున్న స్మగ్లర్లు


పీలేరులో విలేఖరులతో మాట్లాడుతున్న టీడీపీ నాయకులు

పీలేరు, ఫిబ్రవరి 6: అధికార పార్టీ అండదండలతోనే ఎర్రచందనం స్మగ్లర్లు పేట్రేగిపోతున్నారని పీలేరుకు చెందిన టీడీపీ నాయకులు ఆరోపించారు. పార్టీ కార్యాలయంలో మంగళవారం జరిగిన విలేఖరుల సమావేశంలో నాయకులు కోటపల్లె బాబురెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, పోలిశెట్టి సురేంద్ర మాట్లాడుతూ అధికార పార్టీ నాయకులు అండదండలు ఉండడంతోనే ఏం చేసినా చెల్లిపోతుందన్న ధైర్యంతో స్మగ్లర్లు పోలీసులపైనే దాడికి పూనుకున్నారన్నారు. ఏఆర్ కానిస్టేబుల్ గణేశ్ మృతి చెందిన సంఘటనలో ఎంతటి వారున్నా శిక్షించి పోలీసులు తమ చిత్తశుద్ధి నిరూపించుకోవాలన్నారు. స్థానికంగా ఉన్న పలువురు అధికార పార్టీకి చెందిన నాయకులు కేవీపల్లె, సుండుపల్లె మండలాల్లో ఎర్రచందనం స్మగ్లింగ్‌కు సహాయసహకారాలు అందిస్తున్నారని, వారందరినీ ఇప్పటికైనా కఠినంగా శిక్షించాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరోవైపు కానిస్టేబుల్ గణేశ్‌ది ప్రభుత్వ హత్యేనంటూ టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి మద్దిపట్ల సూర్యప్రకాశ్ మంగళవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. గడిచిన నాలుగున్నరేళ్లుగా అధికార వైసీపీ నాయకులు ఏ వ్యవస్థనూ సక్రమంగా పనిచేయనివ్వలేదని మండిపడ్డారు. ఎర్రచందనం స్మగ్లర్లకు ఎమ్మెల్యే టిక్కెట్లు కేటాయించడం వైసీపీకే చెల్లిందన్నారు. ఇకనైనా పోలీసులు ఎవరి ఒత్తిళ్లకు లొంగకుండా గణేశ్ మృతికి కారణమైన స్మగ్లర్లు, వారికి సహకరించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

అశ్రునయనాలతో సహచరుడికి అంతిమ వీడ్కోలు


గణేశ్ మృతదేహాన్ని తీసుకెళుతున్న టాస్క్‌ఫోర్సు సిబ్బంది

పీలేరు, ఫిబ్రవరి 6: ఎర్రచందనం స్మగ్లర్ల ఘాతుకానికి వీరమరణం పొందిన తమ సహచరుడికి టాస్క్‌ఫోర్స్ సిబ్బంది అశ్రునయనాలతో అంతిమ వీడ్కోలు పలికారు. పీలేరు ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు గణేశ్ మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి అతని బంధువులకు అప్పగించారు. గణేశ్ మృతదేహాన్ని అతని స్వస్థలం సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం గుట్టకిందపల్లెకు చేర్చడానికి పోలీసులు, అక్కడి నుంచి వచ్చిన బంధువులు అంబులెన్సు ఏర్పాటు చేసుకున్నారు. అతని మరణవార్త తెలుసుకుని ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో విధులు నిర్వర్తిస్తున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది మం గళవారం పీలేరు ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకున్నారు. గణేశ్‌తో తమకున్న అనుబంధాన్ని గుర్తు చేసుకుని కన్నీళ్లు పెట్టుకున్నారు. చాలా మంది గణేశ్ కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. గణేశ్ మృతదేహానికి అధికార లాంఛనాలతో బుధవారం అంత్యక్రియలు నిర్వ హించనున్నట్లు పోలీసులు తెలిపారు.

స్ట్రాంగ్‌రూమ్‌లను పరిశీలించిన ఆర్డీవో


మదనపల్లె జడ్పీహైస్కూల్లో స్ట్రాంగ్‌రూమ్ గదులను పరిశీలిస్తున్న ఆర్డీవో హరిప్రసాద్

మదనపల్లె టౌన్, ఫిబ్రవరి 6: మదనపల్లె నియోజకవర్గం పరిధిలో నిర్వహించనున్న ఎన్నికల ప్రక్రియలో భాగంగా ఈవీఎంలను భద్రపరచడానికి స్ట్రాంగ్ రూమ్, ఎన్నికల సామాగ్రి భద్ర పరచడానికి గదులను ఆర్డీవో హరిప్రసాద్ పరిశీలించారు. మంగళవారం స్థానిక జడ్పీ హైస్కూల్లో మున్సిపల్ కమిషనర్ ప్రమీల, తహసీల్దార్ రమాదేవిలతో కలసి గదులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని మూడు మండలాలు, మున్సిపాలిటిలో 259 పోలింగ్ స్టేషన్‌లు వున్నాయన్నారు. వాటిని సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో ఎన్నికల సామగ్రి పంపిణీకి జడ్పీ హైస్కూల్ అనువుగా ఉందని, ఈ మేరకు జిల్లా కలెక్టర్‌కు నివేదికలు పంపుతామన్నారు. ఎన్నికల డీటీ అస్లాం, మణి తదితరులు పాల్గొన్నారు.

జనసేన-టీడీపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు పనిచేద్దాం

● తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి సాయినాథ్


సమావేశంలో మాట్లాడుతున్న జనసేన పార్టీ ఇన్‌చార్జి సాయినాథ్

ములకలచెరువు, ఫిబ్రవరి 6: రాబోవు ఎన్నికల్లో జనసేన, టీడీపీ పార్టీల ఉమ్మడి ప్రభుత్వం ఏర్పాటుకు కలిసి కట్టుగా కష్టపడి పనిచేద్దామని తంబళ్లపల్లె నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జి పోతుల సాయినాథ్ పిలుపు నిచ్చారు. ములకలచెరువులో మంగళవారం తంబళ్లపల్లె నియోజకవర్గ జనసైనికుల ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనసేన అధినేత పవన్‌కళ్యాణ్ ఆశయ సిద్ధాంతాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లాలన్నారు. అరాచక, అవినీతి వైసీపీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. ఈ సమావేశంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా లీగల్ సెల్ అధ్యక్షుడు అమరనారాయణ, జాయింట్ సెక్రటరీ షాకీర్, పెద్దమండ్యం, పీటీఎం, కురబలకోట మండలాల పార్టీ అధ్యక్షులు శంకర, శంకరప్ప, దామోదర్‌తో పాటు నియోజకవర్గ నాయకులు, జనసైనికులు పాల్గొన్నారు.

దళితుల భూములపైనే ప్రభుత్వం కన్ను

● మాలమహానాడు నేత యమలా సుదర్శనం


మాట్లాడుతున్న యమలా సుదర్శనం

మదనపల్లె, ఫిబ్రవరి 6: నా ఎస్సీ, నా ఎస్టీ, నా బీసీ అని పదేపదే చెప్పుకునే సీఎం జగన్ మోహన్‌రెడ్డి దళితుల భూములపైనే కన్నేశాడని మాలమహానాడు జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ యమలా సుదర్శనం ఆరోపించారు. స్థానిక గాంధీరోడ్డులోని తన కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జగన్‌పై, ప్రభుత్వంపై మండిప డ్డారు. నాలుగున్నరేళ్ల వైసీపీ ప్రభుత్వంలో అన్ని రంగాల్లో దళితులను అణిచివేత తప్ప.అభివృద్ధి శూన్య మని విమర్శించారు. రాష్ట్ర వ్యాప్తంగా రోడ్డు పక్కనున్న దళితుల భూములపై కన్నేసి ప్రభుత్వ కార్యాలయాల నిర్మాణంతోపాటు పెత్తందారులకు దారపోస్తున్నట్లు ఆయన విమర్శించారు. దళితులకు చెందిన భూములు దళితులకే దక్కాలని యమలా డిమాండ్ చేశారు. ఇందులోభాగంగా మదనపల్లె మండలం బసినికొండ రెవెన్యూ గ్రామం సర్వే నంబర్:235-3లోని 2.05ఎకరాల భూమిని కొండామరిపల్లెకు చెందిన రామాపురం వెంకటమ్మ పేరున గతంలో డీకేటీ పట్టా ఇచ్చారని ఈ భూమిలో మున్సిపల్ నూతన కార్యాలయం నిర్మించాలని పాలకవర్గం ఆమోదించడాన్ని ఆయన తప్పు పట్టారు. కౌన్సిల్ పాలకవర్గం నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని లేకుంటే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని యమలా సూచించారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు గూండాల మనోహర్, మోహన్, చంద్రయ్య పాల్గొన్నారు.

ప్రభుత్వాల అప్రజాస్వామిక పాలనను తిప్పికొట్టాలి


మహిళలను కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రెడ్డిసాహెబ్

మదనపల్లె అర్బన్, ఫిబ్రవరి 6: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అప్రజాస్వామిక పాలనను ప్రజలు తిప్పికొట్టాలని మదనపల్లె నియోజవకర్గ నాయకుడు రెడ్డిసాహెబ్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశంలో రెడ్డిసాహెబ్ ఆధ్వర్యంలో నీరుగట్టువారిపల్లెకు చెందిన కొందరు మహిళలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి రెడ్డిసాహెబ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు ప్రజలజీవితాలను నడ్డివిరిచే విధంగా ఉన్నాయని ఆరోపించారు. ప్రభుత్వాల పనితీరుపై విసిగి వేశారిన ప్రజలు ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీవైపు చూస్తున్నారన్నారు. కార్యక్రమంలో నాయకులు సురేంద్రరెడ్డి, ఈశ్వరమ్మ, మహమ్మ ద్‌రఫీ, మహమ్మద్‌అలీ, అమీర్‌జాన్, రవీంద్ర పాల్గొన్నారు.

తంబళ్లపల్లె ఎంపీడీవోగా క్రిష్ణమూర్తి


నూతన ఎంపీడీవోకు అభినందనలు తెలుపుతున్న ఉద్యోగులు, సిబ్బంది

తంబళ్లపల్లె, ఫిబ్రవరి 6: తంబళ్లపల్లె ఎంపీడీవోగా క్రిష్ణమూర్తి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. సార్వత్రిక ఎన్నికల సందర్భంగా గతంలో ఇక్కడ ఎంపీడీవోగా పనిచేస్తున్న సురేంద్రనాథ్ కడప జిల్లాకు బదిలీ అయ్యారు. దీంతో ఆయన స్థానంలో అదే జిల్లాలో సింహాద్రిపురం మండల ఎంపీడీవోగా పనిచేస్తున్న క్రిష్ణమూర్తి బదిలీపై తంబళ్లపల్లెకు వచ్చారు. నూతనంగా వచ్చిన ఎంపీడీవోకు మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు పుష్పగుచ్ఛం అందించి అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడు తూ..ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ గ్రామ సచివాలయాల ద్వారా అన్ని రకాల సేవలను అర్హులైన ప్రతి ఒక్కరికీ అందించేందుకు కృషిచేస్తానన్నారు.